ఆదివారం

ప్రజాశక్తి

మే 22, 2005

కథా నిలయం

Entered

ఆవకాయ

తెలుగు రుచికి చిరునామా

హ్యాపీ బర్త్‌డే

22.5.2005నుంచి
28.5.2005వరకు

పి. మేఘన(అమ్ములు)
2సంll, 23.5.2003
నీరజ-వీరారెడ్డి
ముత్తంగి-మెదక్

దీప
2సంll, 25.5.2003
కృష్ణవేణి-సత్యం
తుమ్మికాపల్లి-విజయనగరం

మణిదీప్(సాయి)
1సంll, 27.5.2004
రజని-శ్రీనివాసులు
చౌటుప్పల్-నల్లగొండ

శ్రీవల్లి
3సంll, 27.5.2002
మాధవి-నాగేశ్వరరావు
తిరుమలాయపాలెం-ఖమ్మం

కల్యాణ్
4సంll, 24.5.2001
నాగలక్ష్మి-నవీన్
జగ్గయ్యపేట-కృష్ణా

సోమశేఖర్
5సంll, 27.5.2000
మాలతి-రామకృష్ణ
పాలకొల్లు-పllగోll

షేక్ నీహ
4సంll, 27.5.2001
నీల్‌కమల్-చంద్‌బాషా
వెలిగండ్ల-ప్రకాశం

సందీప్‌గౌడ్
1సంll, మే-2004
రమణ-కృష్ణాగౌడ్
దేవరకొండ-నల్లగొండ

హర్షిత్ రెడ్డి
3సంll, మే-2002
హరిత-శ్రీయత్‌రెడ్డి
నెమ్మాని-నల్గొండ

సాయిరాం
3సంll, 28.5.2002
పుష్ప-సత్యనారాయణ
ఇంద్రపాలనగరం-నల్లగొండ

షేక్ రిజ్వానా
షహనాబేగం-షేక్ ఖాజామియా
కమలాపురం-ఖమ్మం

సిహెచ్. గౌతమ్
2సంll, 22.5.2003
చిట్టెమ్మ-నారాయణ
రావినూతల-ఖమ్మం

2సంll, మే-2003
అప్పాజీపేట-నల్లగొండ

గమనిక: పదేళ్ల వరకు వయస్సు గల చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టిన రోజుకు 20 రోజులు ముందుగా ఓ కలర్ ఫొటో జత చేసి మీ చిన్నారి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వంటి వివరాలు పంపడమే. ప్రజాశక్తి శుభాకాంక్షలతో మీ చిన్నారి పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోండి.

పంపవలసిన చిరునామా:
హ్యాపీబర్త్‌డే, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం,
1-1-298/4, అశోక్‌నగర్, హైదరాబాద్-20



లెటర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం

కవర్‌స్టోరీ

మే 8వ తేదీ ఆదివారం సంచిక కవర్‌స్టోరీ సైన్స్‌పరంగా బావుంది. "ప్రకృతి మన మాట వింటుందా?!" అనే ప్రధానవ్యాసంలో ఋతువులు తమ తీరు మార్చుకుంటున్నపుడు మానవాళి శాస్త్రవిజ్ఞానంతో ప్రకృతిని తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు వివరించారు. ఒకరి ప్రయోజనాలకోసం మరొకరిని ఇబ్బందులకు గురిచేయకుండా శాస్త్రఫలాలను సద్వినియోగపరుచుకోవాలని ఐ.రా.స. తీర్మానించి నియంత్రించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఏదిఏమైనా ప్రకృతి విపత్తులను పసిగట్టడం నియంత్రణ వ్యవస్థల్ని మెరుగువర్చుకోవడంద్వారా మానవాళిని కాపాడుకోవడం తప్ప, ప్రకృతిని మన మాట వినేటట్టు చేసుకోవడం కష్టమేనని వ్యాసం తెలియజేసింది. జీవనశైలి, ఇంతిసంగతులు వ్యాసాలు బాగున్నాయి. కచేరి శీర్షికలో యాస కొంచెం ఎక్కువనిపించింది.

ఎస్‌కె జహంగీర్,

విడవలూరు, నెల్లూరుజిల్లా

క్యూబా మార్గం అనుసరణీయం

కవర్‌స్టోరీలో భాగంగా రాసిన ప్రకృతివిలయాల్ని తట్టుకోవడంలో క్యూబా ప్రభుత్వం చేస్తున్న కృషి అందరికీ అనుసరణీయమైంది. ఒక చిన్న దేశం ప్రజాదృక్పథం ఉండుట వల్ల ఎంత చక్కగా తన ప్రజల్ని కాపాడుకోగలుగుతుందో వారి అనుభవం తెలియజేస్తోంది. అమెరికాలాంటి తలబిరుసు దేశాలకు కూడా ఈ దేశ అనుభవం కళ్ళు తెరిపించేదిగా ఉండుట ఆశ్చర్యకరంగా ఉంది.

ఎం రామారావు,

పెజ్జోనిపేట, ఒన్‌టౌన్, విజయవాడ.

కథ స్ఫూర్తిదాయకం

తల్లుల దినోత్సవం సందర్భంగా ప్రచురించిన "బంధం" కథ మా అందరికీ నచ్చింది. ప్రతీ భార్యలోనూ తల్లి కూడా ఉంటుందనేదానికి పోచమ్మ పాత్రను రూపొందించడం చాలా హృద్యంగా ఉంది. ఎయిడ్స్‌బారిన పడ్డవారి పట్ల ఈ సమాజం తల్లివలే చూసుకోవాలనే స్ఫూర్తిని ఇస్తోంది ఈ కథ.

-ఎమ్ నారాయణ స్వామి,

సంగడిగుంట, గుంటూరు.

ఈ వారం ఇంతి సంగతి

ఇంతిసంగతులు శీర్షికలో "మీ కోసమే పూలు పెట్టుకోవాలా?" రచన బాగుంది. ఆ రచన చదివి ఎంతగానో ఆనందించాం. ముఖ్యంగా పువ్వులు, పూలజడలు గురించి చదవగానే నాకు కూడా జడగంటలు వేసుకుని పూలజడ వేయించుకోవాలనే కోరిక కలిగి మా అమ్మగారిని అడిగి వేయించుకుని, ఫొటో తీయించుకున్నాను. దాన్ని ఎంతో భద్రంగా దాచుకున్నాను.

జె శ్రావణి,

ఇంజనీరింగ్ విద్యార్థిని, పాల్వంచ.

చక్కని రచన

ఈ వారం ఇంతసంగతులు ఐటమ్‌గా సున్నితమైన అంశం గురించి చక్కగా రాశారు. పూలు మీకోసమే పెట్టుకోవాలా అనే అంశం బాగా రాశారు. అది చదివి చాలా ఆనందించాం. ఇటువంటి రచనలు పత్రికలో ఎప్పుడూ రావాలని కోరుకుంటున్నాం.

-ముత్యం ఉష,

కొత్తగూడెం.

అన్నమో రామచంద్రా... నీళ్ళో నారాయణ

కచేరి శీర్షికలో వచ్చిన రచన ఆలోచనాత్మకంగానూ, వ్యంగ్యంగానూ ఉంది. మంచినీళ్ళు కూడా ఇవ్వలేని రాజకీయ నాయకులను నిలదీయాలనే స్ఫూర్తిని, ఆలోచనను ఇస్తోంది. చక్కటి రచన ప్రచురించినందుకు ధన్యవాదాలు.

డి రామిరెడ్డి,

సంతనూతలపాడు, ప్రకాశంజిల్లా

కవితలు బాగున్నాయి

పత్రిక ప్రధానవ్యాసానికి తగ్గట్టుగా ఈ వారం ఇచ్చిన కవితలు బాగున్నాయి. "ప్రకృతి పాఠాన్ని కవిత్వీకరించడమే కాదు/భూగోళాన్ని చూపుడువ్రేలిపై నిలబెట్టినంత పనిచేయాలి" అని చెప్పడం ఎంతో కవితాత్మకంగానూ, ప్రకృతి విలయాల్నుండి మానవాళిని రక్షించేందుకు ఏమైనాసరే చేయాలని సుబోధకంగానూ ఉంది.

-విరియాల నాగమోహనరావు,

రాజాం, శ్రీకాకుళం జిల్లా.

కలికాలం మరి!

ముంగిట్లో కొచ్చేసింది రోహిణి. రోహిణిలో రోళ్లు పగుల్తాయట. ఎండల్ని చూస్తే రోళ్లు రోహిణి దాకా ఆగేట్లు లేవు. రోళ్ల మాట ఎలా ఉన్నా మనుషులకు మాత్రం ముంచు కొచ్చినట్లుంది. మనుషులకేమిటి వడగాలులు జీవకోటినే మింగేస్తున్నట్లుంది. నరులను నమిలి తింటున్నాయి. పక్షులను నంజుకొంటున్నాయి. గువ్వలు, గోరంకలు, చిలుకలు, పావురాలు అలా నోరు తెరుచుకొని టపాటపా రాలిపోతున్నాయి.

ఎండలకు తోడు అప్పులూ, అమాయక పక్షులకు ప్రాణాంతకమయ్యాయి. మనుషులు అప్పు చేసి తీర్చలేక పోతే ఆత్మహత్యలు చేసుకొంటారు. వారి కుటుంబం వీధుల పాలవుతుంది. ప్రభుత్వం అప్పు చేస్తే మొత్తం ప్రకృతికే ప్రమాదం ముంచుకొస్తోంది. కాకపోతే చూడండి... అప్పులిచ్చే ప్రపంచ బ్యాంకు పుణ్యమాని పబ్లిక్ నల్లాలు అదృశ్యమయ్యాయి. కొళాయిల చుట్టూ నీటి మడుగులు గత వైభవమయి కూర్చుంది. బొట్టు బొట్టుకూ లెక్క గట్టి చార్జిచేసే కాలంలో నీరూ బంగారమే మరి. ఎవరు మాత్రం ఎందుకు పారబోసుకొంటారు. ఎవరూ పారబోయకుండా పక్షులకు నీరెలా దొరుకుతుంది. ఎంకిపెళ్లి సుబ్బిచావుకు వచ్చింది. మనుషులకు నీటి మాటేమిటోగాని పక్షులకు మాత్రం ప్రాణసంకటం వచ్చి పడింది.

మంచి నీరు లాభసాటి వ్యాపారమయింది. చలివేంద్రాల సదాచారం చప్పబడింది. చల్లటి నీరు సీసాల్లో, పీపాల్లో దొరుకుతోంది. కాకపోతే పాలధరకంటే నీటి ధర ఎక్కువ. పళ్ల రసాల అంగళ్లు, షర్బత్ దుకాణాలు, కొబ్బరి బోండాల షాపులు పాతబడ్డాయి. వాటి యజమానులు బతికి చెడ్డ కేటగిరి కిందకొచ్చేశారు. భుగభుగ పొంగే కోక్‌లు, పెప్సీలు ఫ్యాషన్ అయిపోయాయి. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలన్నీ, విదేశీ డ్రింకుల్లోనే ఉన్నట్లు టీవిలో ఒకటే రొద. యువతేమిటి అందరూ ఈ మోజులో కొట్టుకుపోతున్నారు. ఒక వైపు నీటి సరఫరాపై నియంత్రణ. మరోవైపు జోరుగా నీటి వ్యాపారం.

పక్షులకు నీరు దొరకదు. నీరు, బీరు అమ్ముకోవడానికి మాత్రం కింగ్ ఫిషర్ బొమ్మ ఎంచక్కా పనికొస్తుంది. కలికాలం అంటే ఇదే మరి!

✿

ఈ సంచికలో . . .

ఓరా! ...	3
కార్టూన్ కదంబం... ...	4
కవర్ స్టోరీ ...	5
జీవనశైలి ...	10
బాలల కథ ...	11
బాలనేస్తాలు ...	12
ఇంతి సంగతి ...	16
కచేరి ...	17
ఆరోగ్యం ...	18
పుస్తక పరిచయం ...	21
న్యాయసలహాలు ...	24

ఇంకా...

"ఎదబాటు"

కథ .. 8, 9



రియల్ స్టోరీ ... 14, 15



టూరిస్ట్‌గైడ్ ... 14, 15



'నానీ'ల తొలి కవయిత్రి

కళాసాహితి . . . 22, 23

రోబో రెసెప్షనిస్ట్

"రెసెప్షనిస్టులుగా అందమైన అమ్మాయిలు కావలెను, ఇంగ్లీషు, హిందీ భాషలు అనర్గళంగా మాట్లాడవలెను" అని ప్రకటనలిచ్చి, ఇంటర్వ్యూలు జరిపి సెలెక్ట్ చేసుకునే శ్రమ లేకుండా అయిపోయింది. ఎలక్ట్రానిక్ వస్తూత్పత్తిలో యమహా స్పీడ్‌గా అభివృద్ధి చెందుతున్న జపాన్ దేశ కంపెనీలు ఆ కష్టం తప్పించేశాయి. సెంట్రల్ జపాన్‌లోని అయిచీ కంపెనీ "ఏక్ట్రాయిడ్" అనే మానవ రోబో ను తయారుచేసింది. ఆ యంత్ర మానవి ఎంచక్కా నలభైవేల పదప్రయోగాల్ని ఇట్టే అర్థంచేసేసుకుని "యస్ మైడియర్ ఫ్రెండ్" అని సమాధానం ఇస్తుందిట! జపనీస్, కొరియన్, చైనీస్, ఇంగ్లీష్ భాషా పదాల్ని విన్నంతనే మిస్ రోబోరాణి స్పందించి తగు సమాచారం ఇస్తుంది. తగు చర్యలు చేపడుతుంది. ఈ ఏడాది మార్చి 25 నుంచి సెప్టెంబర్ 25 వరకూ ఎయిచీ ఎక్స్‌పో ప్రదర్శన పెట్టి సదరు "యంత్ర పరిచారికల"ను అమ్మకాలకు పెట్టారు.

భౌభౌలకూ ఫ్యాషన్‌పెరేడ్

ర్యాంపుల మీద అందాల ప్రదర్శన చేసేది అమ్మణీలేనా?! మేమేం తక్కువా భౌభౌ...భౌభౌ" అనంటున్నాయి శునకేశ్వరీలు. మహారాష్ట్ర చెంబూర్‌లోని "కె-9 క్లబ్" వారు కుక్కల ఫ్యాషన్ పెరేడ్ నిర్వహించారు. ఈ డాగందాల పోటీ నాలుగు అంశాలలో జరిగింది. క్రీడాస్ఫూర్తి, శాంతస్వరూపం, విశ్వాసపాత్రం, విధినిర్వహణ అనే అంశాలలో కాంపిటీషన్ పెట్టారు. "ప్రతీ కుక్కగారు తమ ఆంగికాభినయం, విధేయత, వస్త్రధారణలు డిటోగా చక్కగా ప్రదర్శించాలి" అని నిర్వాహకులు ముందే ప్రకటించారు. గెలుపొందిన కుక్కయ్య/కుక్కమ్మలకు అందాలరాణులకు మల్లే సిగలో కిరీటాదులు, "అందాల శునకః" అను టైటిల్ రిబ్బన్ అలంకరించబడును అంటున్నారు. రెడీ టూ భౌభౌ ఫ్యాషన్ షో!!!



ఏనుగుమహాన్‌లకూ కట్టుడుపళ్ళ సింగారం!



కేరళలోని కోచి దేవాలయ ఏనుగులు ఊరేగడానికి మహా సిగ్గు పడిపోతున్నాయట! కొండంత దేహ గజాలకు గజమంత కాకపోయినా ఓ అడుగంత దంతమన్నా లేకపోతే ఏం బావుంటుందీ అని తెగ బాధపడిపోతున్నాయట! వాటి బాధను కాస్మోటిక్ డెంటిస్ట్ ఒకాయిన అర్థం చేసుకున్నట్లున్నాడు. వాటి దేహ, వక్రతుండ ముఖారవిందాలకు సరియగు పెట్టుడు దంతములను అమర్చాడు. చిన్నవిగా, బలహీనంగా ఉన్న దంతాలకు కాల్షియం ఫాస్ఫేట్ ట్రీట్‌మెంట్ ఇచ్చాడు. ఇక చికిత్సకు లాభంలేదన్నవాటిని తొలగించి, కృత్రిమ దంతభాగాల్ని అమర్చి వాటి దంత, ముఖారవిందాల అందాల్ని ద్విగుణీకృతం, త్రిగుణీకృతం చేశారు. దాంతో ఇక ఎప్పుడెప్పుడు నంబరాలొస్తాయా తమ కట్టుడువళ్ళతో సకిలించుదామని...సారీ...ఇకిలిద్దామనీ...మళ్ళీ సారీ....ఘీంకరిద్దామని తెగ ఉబలాటపడిపోతున్నాయి.





హిందూ... నుంచి

కనదగు నెవ్వరు గీచిన...



డెక్కన్ క్రానికల్ నుంచి



తెలుగు రుచికి చిరునామా

సత్య

తెలుగు లోగిళ్లకూ పచ్చళ్లకూ విడదీయరాని బంధం ఉంటుంది. కొంతమందికి తొక్కుడు పచ్చడి(దీన్నే కొన్ని ప్రాంతాలలో రోటి పచ్చడి, బండ పచ్చడి అని కూడా అంటారు) లేందే ముద్ద దిగదు. వేడి వేడి అన్నం తొక్కుడు పచ్చడికి నెయ్యి జత చేస్తే వేరే కూరల జోలికి పోరు మరి ! మరి కొందరుంటారు అతిధులకు నిలవ పచ్చడి వడ్డించక పోతే అవమానంగా భావిస్తారు. ఎన్ని ఉన్నా పచ్చళ్ల కోసం ఎదురు చూసే వారి గురించి కవులు సైతం గానం చేశారు ......

"ఊరినకొద్దీ ఆవకాయకు రుచెక్కువ అన్నట్లు చేరువైన కొద్దీ నీకు తొందరెక్కువగా ఉంది. మన విషయం ఇప్పుడే గనుక మా ఇంట్లో తెలిసిందో మా అన్నయ్య నన్ను పచ్చడి కింద కొట్టేస్తాడు. వద్దు ప్లీజ్ !"

"నిజమే అన్న ప్రాసన నాడే ఆవకాయ పచ్చడా ! అన్నట్లు పరిచయం అయిన వెంటనే చెప్తే తట్టుకోలేరు డియర్. నీ మాటే నామాట. ఓకే. అన్నట్లు మీ అమ్మమ్మకు పాత చింతకాయ పచ్చడి అంటే ఇష్టం అన్నావు కదా మా ఇంట్లో ఎప్పుడూ ఉంటుంది. మా నాన్నకు అదుంటే చాలు. కంచాలకు కంచాలు లాగించేస్తాడు. మా అమ్మకు చెప్పి కొంత పచ్చడి మీ అమ్మమ్మకు పంపిస్తా."

"అవును మీది గుంటూరు కదా చింతకాయతో పాటు పండుమిరపకాయ, గోంగూర పచ్చడి కూడా పంపించెయ్. వాటి పేరు తలుచుకుంటేనే నాకు నోరూరుతోంది. మా అమ్మను పెట్టమన్నా పెట్టదు."

హాయ్ పాఠకులూ... మనం ఇలా దొంగచాటుగా ప్రేమికుల కబుర్లు వినటం సరైంది కాదు వాళ్ల గొడవేదో వారికే వదిలేద్దాం. వారి సంభాషణల్లో చోటు చేసుకున్న పచ్చళ్ల గురించి మనం తెలుసుకుందాం. ఎందుకంటే ఇది పచ్చళ్లు ముఖ్యంగా తెలుగువారి ఆవకాయ సీజన్ కదా!

దీని తస్సాదియ్యా ...ఇప్పుడు ఎక్కువ తింటే కడుపులో మంట, అల్సర్లు, శరీరం పెరిగిపోయి కాళ్లు, కీళ్ల నొప్పులు వస్తాయని డాక్టర్లు అంటున్నారు గాని... **'వప్పుతోటి ముద్దకలిపి వచ్చడితో అనుపానమేసి బక్కపేగులకు పట్టిస్తుంటే భళా బండి నా బండి పరుగూతీసే బండి '** అన్న భీముడి పాటను వింటుంటే నోరూరని తెలుగువారుంటారా చెప్పండి. ఇంతకూ భీముడు ఏ పచ్చడి గురించి చెప్పి ఉంటాడంటారు? ఆవపిండి పులుముకొని నూనెలో జలకాలాడుథూ వెల్లుల్లి రేకలతో సరాగాలాడుతూ రంగుతేలే మామిడి కాయ



గురించి గాక మరొకటి అనుకోలేము. ఆవకాయ అంటే మా చిన్నప్పుడు చద్ది అన్నానికి గడ్డపెరుగును జతచేసి ఆవకాయ ముక్క ఇచ్చే మా నాన్నమ్మ గుర్తుకు రాకుండా ఎలా ఉంటుంది చెప్పండి? అందుకే...

"...కొసరి చల్దుల మెక్కు గొల్లపిల్లల
వ్రేళ్ళ సందు మాగాయ పచ్చడి పసందు"

...అని పోతనామాత్యుడు తన మహాభాగవతం-దశమ స్కంధం వనభోజనాల సన్నివేశంలో శ్రీకృష్ణుడు తాను చూసిన సన్నివేశ వర్ణనలో ఈ మాగాయ పచ్చడి, పెరుగన్నం గురించి చెప్పారు.

ముసలి తనంలో ఏవేవో జబ్బులొచ్చి చంపుతాయని ఇప్పటి నుండే జిహ్వా రుచి చంపుకోవాలా అని మా తాతయ్య తిరుగుబాటు చేసేవాడు. "మన పొలంలో పని చేసే కూలీలు పండుగలకో పబ్బాలకో తప్ప కూర మొహం ఎరగరు, పచ్చడి, గొడ్డుకారాలేగా వాళ్లు తినేది" అనేవాడు. అదేం చిత్రమో గాని చివరి వరకు ఆయన గుండులా ఉన్నారు. అందరూ చెప్పిన అన్ని జాగ్రత్తలూ పాటించిన మరోతాతయ్య మంచాన పడి దీర్ఘకాలం ఉన్నారు. ఇలా పచ్చళ్ల గురించి ఎంత చెప్పుకున్నా తరగదు మరి. ఎందుకంటే మన పచ్చళ్ల చరిత్ర అంత పురాతనం గనుక.

ప్రపంచానికి మనమేం ఇచ్చాం అధిక జనాభా తప్ప అని నా మిత్రుడుకొరు అంటాడెప్పుడూ. అది నిజం కాదు. ఆహారానికి సంబంధించి పచ్చళ్లు, సలాడ్‌లను అందించింది మన దేశమే అన్న వాస్తవం కొద్దిమందికే తెలుసు.

పచ్చళ్లే కాదు:...వాటి చరిత్రా బహుషసందే!

క్రీస్తు పూర్వం 2030లో అంటే నాలుగువేల సంవత్సరాల నాడు మన దేశం నుండి పశ్చిమాసియాలోని టైగ్రిస్ నదీ లోయ ప్రాంతానికి మన దోసకాయలు వెళ్లాయి. వాటిని వాళ్లు నిలవ చేసుకొని పచ్చళ్లుగా తిన్నారని చరిత్ర చెబుతోంది. అందుకే బైబిల్‌లో కూడా రెండు చోట్ల(11.5



'పంచె కట్టుడులో ప్రపంచాన మొనగాడు
అవకాయ వియోగమసలే సైపనివాడు
పంచభక్ష్యాలు తన కంచాన వడ్డించ
గోంగూర కోసమై గుటకలేసేవాడు
ఎవడయ్య ఎవడువాడు
ఇంకెవడయ్య తెలుగువాడు'

...అని మన సినారె తన కవితలో చెప్పారు.

మహాకవి
కాళిదాసుని
నీవే వరం
కోరుకుందు
వంటే...

"కాళిదాస కవితా, నవంవయః
మహిశంభదధి, శశక్కరం విపయః
ఏణమంసం అబలాచ కోమలా
సంభవంతు మమ జన్మది
కలుగుగాక" ...అనంటాడు.

అదే తెలుగువాడిని అడిగితేనో... **ఆవకాయ,** గోంగూర కావాలి అని అంటాడని ఛలోక్తి.

ఆవకాయ ఇలా చేద్దాం

-శారద

ఆవకాయ ఎంతకాలం నిలవ ఉంటే అంతబాగా కుదిరినట్లు. దీనికీ ప్రమాణాలున్నాయి. అయిపోయే చివరిరోజు వరకు ముక్క మెత్తపడకూడదు. అందుకే అనేక జాగ్రత్తలు కూడా అవసరం మరి. సాధారణంగా ఆవకాయ పెట్టే జాడీలలో వేరే పచ్చళ్లు పెట్టవద్దని అమ్మమ్మలు చెబుతారు. ఆవకాయ పెట్టుకోవాలంటే సన్నాహాలు ఎన్నో! పచ్చడి పెట్టుకోవాలని నిర్ణయించుకున్న తరువాత కొత్త జాడీలైనా, ఇతర పచ్చళ్లు పెట్టిన పాత జాడీలైనా బాగా కడిగి మూడు నాలుగు రోజులు బాగా ఎండబెట్టాలి. పాతావకాయ జాడీలైతే బాగా కడిగి ఒక రోజు ఎండలో పెడితే చాలు. మార్కెట్‌లో పలు సైజుల్లో మామిడి కాయలు దొరుకుతున్నాయి. అందు వలన కాయల లెక్కన అయితే పచ్చడిలో కలుపుకోవాల్సిన ఇతర సరుకులలో తేడా వస్తుంది. అందువలన ఎవరైనా వంతుల చొప్పున పాళ్లు కలుపుకోవటం మంచిది. పచ్చడి నిల్వ ఉండాలంటే రాలిన కాయలు లేకుండా చూసు కోవాలి. బాగా పులుపు, పీచు ఉన్న రకాలను ఎంచుకోవాలి.

చిన్న రసాలు, పెద్దరసాలు, అంటుమామిడి రకాలను ఎక్కువ మంది ఇష్టపడతారు. కాయలు మెత్తబడితే పచ్చడి నిలవ ఉండదు. అందువలన కాయలు కొన్న చోటే కడగించి వాటిని మనకు కావలసిన సైజులో ముక్కలుగా కొట్టించుకుంటే మెత్తబడిందీ లేనిదీ తెలుస్తుంది. ఒక వేళ మెత్తబడిన ముక్కలు వస్తే కాయలను అమ్మినవారికి వాపస్ ఇచ్చి వేరేవి తీసుకోవచ్చు. కొంతమంది కాయలను నీళ్లలో ఒకపూట ఉంచి

బాగా తుడిచి ఇంటిదగ్గర ముక్కలు

మరియు ఏసయ్య 1.8) వాటి ప్రస్తావన వస్తుంది. క్రీస్తు పూర్వం 850లో ఆరిస్టాటిల్ దోసకాయలోని వైద్య గుణాన్ని ప్రశంసించాడు. మనలో మాట... అందరూ నమ్మరు గాని, ప్రపంచ సుందరి క్లియోపాత్రా తన అందచందాలను కాపాడుకొనేందుకు దోసకాయలను వినియోగించేదట. దోసకాయ ముక్కలు, రసంతో ముఖాన్ని మర్దన చేసుకోమని ఎప్పుడైనా ఏ భార్య అయినా తనతో పాటు భర్తను కూడా పోరు పెట్టిందనుకోండి... ముఖ వర్చస్సుకోసమే అని ఇప్పటికైనా తెలుసుకోండి. ఇలా గ్రీకు, రోమన్ చక్రవర్తుల గురించి కూడా ఎంతైనా చెప్పుకోవచ్చు. ఐరోపాలో పచ్చళ్లు పదమూడవ శతాబ్దం నుండి విందుల్లో ఒక ముఖ్యమైన ఐటంగా మారాయి. అమెరికాను కనుగొన్న కొలంబస్ తనతో పాటు తీసుకువెళ్లిన దోసగింజలను *తొలిత హైతీలో నాటి విస్తరింప చేశారు. న్యూయార్క్* ప్రాంతంలో సెటిలర్లుగా ఉన్న డచ్ రైతులు దోసకాయలను తొలిసారిగా మార్కెట్‌లో విక్రయించారు. వారే పచ్చళ్ల పరిశ్రమకు ఆద్యులని చెప్పవచ్చు. అంతేకాదు నావలలో ప్రయాణించే వారికి ఈ పచ్చళ్లు ఎంతో ఉపయోగపడేవి. తరువాత యుద్ధాలలో సైనికులు సులభంగా మోసుకుపోయే, ఎక్కువ రోజులు నిలవ ఉండే ఆహారంగా కూడా పచ్చళ్లు చేరాయి. మన దేశం వెలుపల పచ్చళ్లు ఐరోపా, అమెరికాలో ప్రాచుర్యం పొందినప్పటికీ వాణిజ్య పరంగా సీసాలలో నింపి విక్రయించటం 1820 ఫ్రెంచి జాతీయుడు నికోలస్ అపెర్ట్ ప్రారంభించాడు. క్రీస్తు శకం రెండవ శతాబ్దం నాటికి చైనాలో, ఉత్తర ఆఫ్రికా, ఇటలీ, ఆసియా మైనరు తదితర తూర్పు దేశాలన్నింటికీ దోసకాయ వ్యాపించింది. మన దేశంలో ముఖ్యంగా దక్షిణ భారత్‌లో పచ్చళ్లు ఎంతో ప్రాచుర్యం పొందాయి. వీటిని వాణిజ్య సరళిలో విక్రయించాలని అనేక కంపెనీలు ప్రయత్నించినా పెద్దగా విజయవంతం అయినట్లు చెప్పలేం. ఎందుకంటే ఒక విధంగా చెప్పాలంటే ఆంధ్రప్రదేశ్ లో ప్రతి గృహిణి ఏదో ఒక పచ్చడి తయారు చేయటంలో నిష్ణాతురాలే *అంటే అతిశయోక్తి కాదు. అందుకే దుకాణాలలో* కొనుక్కోవటం అంటే సాధారణంగా గిట్టదు. స్వగృహ ఫుడ్స్ పేరుతో దుకాణాలు వెలిసిన తరువాత పిండివంటలతో పాటు పచ్చళ్లు కూడా విక్రయాలలో భాగమై పోయాయి. కంపెనీలలో తయారయ్యే వాటి కంటే మెరుగ్గా ఉండటంతో వాటికి డిమాండ్ కూడా వచ్చింది. దీనిని చూసి కోస్తా జిల్లాలలో అనేక మంది గృహిణులు పచ్చళ్లు తయారు చేసి హైదరాబాద్, విశాఖ, విజయవాడ వంటి ప్రధాన పట్టణాలకు సరఫరా చేస్తున్నారు. కొన్నిగ్రామాలలో పచ్చళ్ల తయారీ అనేక మందికి ఉపాధికూడా కల్పిస్తున్నది.

వెజిటేరియన్- నాన్ వెజిటేరియన్ అవకాయ

ఇదేమిటి ఇక్కడ కూడా ఈ గొడవ అనుకుంటున్నారా ! ఆగండి మరి ! మన రాష్ట్రంలో పచ్చళ్ల తయారీ ఆయా సామాజిక తరగతుల ఆహార అలవాట్లను బట్టి కూడా ఉంటుంది. అందుకే ఆవకాయల్లో అనేక రకాలు. వెల్లుల్లి వేస్తే అది నాన్ వెజిటేరియన్, వేయకుంటే వెజిటేరియన్ ఆవకాయ అవుతుంది. కొందరు ఆవకాయలో సెనగలు కూడా వేసుకుంటారు. ఇలా కొందరికి ఇంగువ గిట్టదు. మరి కొందరు అది లేందే ముట్టరు. ఇన్ని విషయాలు మాట్లాడుకొని కనీసం కొన్ని పచ్చళ్లు ఎలా తయారు చేసుకోవాలో చెప్పుకోకపోతే అవి పాళ్లు సరిగా లేని ఆవకాయలా ఉంటుంది. అందుకే వాటి విధానం కూడా చూడండి మరి. (ఆవకాయలలలో ఎన్నో రకాలు ఉన్నాయి. స్థలాభావం రీత్యా మరొక సందర్భంలో వాటి గురించి తెలుసుకుందాం).

కోసుకొని కూడా పెట్టుకుంటారు. ముక్కల్లో జీడి తీసిన తరువాత టెంకపై ఉన్న తెల్లని పొరను తొలగించాలి. పచ్చడిని కలుపుకొనేందుకు ఉపయోగించే పెద్ద స్టీలు బేసిన్‌ను కూడా బాగా కడిగి ఆరబెట్టి మాత్రమే వినియోగించాలి. ముక్కలను ఏదో ఒక గిన్నెతో గోపురం మాదిరి కొలవాలి. దానితోనే కారం, ఉప్పును కూడా తలకొట్టి కొలిచి వేసుకోవాలి. ఉదాహరణకు అరకిలో బియ్యం ఉడికే గిన్నెతో నాలుగు వంతులు ముక్కలకు ఒక వంతు ఆవపిండి, ఒకవంతు ఉప్పు, ఒక వంతు కారం, ఒక కిలో తొక్క వలచిన వెల్లుల్లి(తినని వారు వేసుకోనవసరం లేదు) గర్భాలు పెద్దవాటిని అలాగే చిన్న వాటిని ముక్క చెక్క చేసుకొని వేసేందుకు సిద్ధపరచాలి. వాసనను ఇష్టపడే వారు ముక్కచెక్క వెల్లుల్లి కొంచెం ఎక్కువ వేసుకోవచ్చు. మెంతుల 150 గ్రాములు మంచి వాసన వచ్చే వరకు దోరగా వేయించి పిండి చేసుకోవాలి. మరోకప్పు వెయించినవి తీసుకోవాలి. వందగ్రాములు జీలకర్రను కూడా వేయించి పొడి చేసుకోవాలి. అరకప్పు వేయించని జీలకర్ర,పసుపు రెండు టీస్పూన్లు తీసుకోవాలి. దంచిన వెల్లుల్లి పావుకిలో, నువ్వులపప్పు నూనె(పొట్టు తీసిన నువ్వులు) లేదా వేరుశనగ నూనె రెండుకిలోలు పోయాలి. నలిగిన ముక్కలను ఎట్టి పరిస్థితులలో పచ్చడికి ఉపయోగించకూడదు. ఖర్చు అని కల పాల్సిన వాటిలో దేన్ని తగ్గించినా పచ్చడి రుచి తగ్గు తుంది. సన్న ఆవాలు ఉపయోగించటం మంచిది. వాటిలో ఇసుక, రాళ్లు చేసు కొని నీటిలో కడిగి ఎండబెట్టి ఆరిన తరువాత పిండి చేయాలి. ఉప్పుకూడా ఎండలో పెట్టాలి. కారం ఎక్కువగా ఉండాలనుకొంటే గుంటూరు మిర్చిని(కారం) ఉపయోగించాలి. లేదా సగం వరంగల్ బొండు మిర్చి, సగం గుంటూరు మిర్చిని కారం పట్టించాలి. గుంటూరు తేజరకం మిర్చి మహాఘాటు ఉంటుంది జాగ్రత్త. మామిడి ముక్కలను తప్పించి మిగిలిన వాటన్నింటినీ పెద్ద బేసిన్‌లో వేసి బాగా కలపాలి. పచ్చడిని పెట్టే జాడీలో అడుగున కొంచెం నూనె, చారెడు ఉప్పు వేయాలి. ఒక స్టీలు గిన్నెలో ఒక కిలో నూనె తీసుకోవాలి. మరొక చిన్న బేసిన్ లేదా ప్లేటులో ముందే కలిపి సిద్ధం చేసుకున్న ఉప్పు, కారం, ఆవపిండి మసాలాను తీసుకోవాలి. ముందుగా మామిడి ముక్కలను చేత్తో తీసుకొని నూనెలో ముంచి మసాలాను బాగా పట్టించి జాడీలో వేయాలి. మొత్తం ముక్కలు, కలిపిన మసాలా అయిపోయేవరకు ఇలా చేయాలి. గిన్నెలో మిగిలిన నూనెను జాడీలో పోసి ముక్కలను సమంగా సర్ది మూత పెట్టాలి. మూడవ రోజున పచ్చడిని బాగా కలిపి రుచి చూసి అవసరం అనుకుంటే తగినంత ఉప్పును కలుపుకోవాలి. మిగిలిన మరో కిలో నూనెను కూడా పచ్చడిలో పోస్తే తినటానికి సిద్ధం అయినట్లే.



ఎడబాటు

జె. వెంకటేష్

"అబ్బబ్బా.. ఎండలు... మండిపోతున్నాయి" ఎర్రటి ఎండలో వచ్చిరావడంతోనే శ్రీనివాసర్రావు హాలులోని సోఫాలో కూర్చున్నాడు.

"సరోజా...డియర్... " లోపల ఏదో పెద్దగోల...

ఆ గోల గత రెండు నెలలుగా ఉంటూనే వుంది. ఆ గోలలో నా మాట చెవిన పడిందో లేదోనని మళ్ళీ గట్టిగా అరిచినట్లు అడిగాడు.

"సరూ..కొద్దిగా మంచినీళ్లు ఇస్తావా..."

"అబ్బబ్బా...ఇక్కడిదాకా వచ్చారుగా... అలాగే వంటింట్లోకెళ్లి మంచినీళ్లు తీసుకోలేరా...అన్నీ నేనే దగ్గరుండి సమకూర్చాలి...రానురాను మీ ధోరణి 'ఎందుకొచ్చిన సంసారం' సీరియల్‌లో తొమ్మిదో భాగంనుంచి మారిపోయిన మొగుడి క్యారెక్టర్‌లాగా తయారవుతోంది"అంటూ బిరబిరా వచ్చి మంచినీళ్ల గ్లాసు చేతిలో పెట్టి అదే స్పీడ్‌తో వెళ్లిపోయింది.

ఉదయం నుండి ఏమీ తినకుండా ఆఫీసుపనిమీద ఎండలో తిరిగితిరిగి నీరసంగా వున్న శ్రీనివాసరావు సరోజ మాటలతో ఇంకా నీరసపడిపోయాడు. మంచినీళ్లు తాగి అలాగే ఆలోచనలో పడ్డాడు.

సరోజకు అతనంటే ప్రాణం..అతను ఏ మాత్రం ఇబ్బందిపడినా తట్టుకోలేదు. అతని తరుపున వాళ్లన్నా..సరోజాకి ఎనలేని అభిమానం,గౌరవం అలాంటిది కొన్ని రోజులుగా ఎందుకు ఇలా వింతగా ప్రవర్తిస్తోంది. ఎప్పుడు నవ్వుతూ, నవ్విస్తూ కొత్తవాళ్లయినా ఇట్టే కలిసిపోతూ కలివిడిగా ఉండేది. అలాంటిది పదిహేనురోజుల క్రితం...

✽ ✽ ✽

''వదినా...వదినా..'' అంటూ శ్రీనివాసరావు తమ్ముడు పెద్ద సూట్‌కేస్ ఒకచేత్తో, భుజాన ఎయిర్‌బ్యాగ్‌తో వచ్చాడు.

"అన్నయ్య ఆఫీసుకెళ్ళాడా వదినా" అనంటుండగానే వెనుకగా అత్తగారు, మావగారు కూడా వచ్చారు.

మొదట్లో మరిదే కదా అని చూస్తున్న సీరియల్ ముందునుంచి లేవకుండానే, అతనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పానో లేదో అన్నంతగా మైమరిచి చూస్తోంది. అత్త మామలుకూడా వచ్చాక తప్పనిసరై టీవీ ముందునుంచి లేచింది.

మాంచి ఉత్కంఠగా సీరియల్ కథ నడుస్తుండగా వచ్చారే అనే విసుగు మనసులో జిమ్మున ఎగసిపడినా పైకి కనబడకుండా దాచుకుంటూ...

"ఎప్పుడు బయలుదేరారు మావయ్యా...అత్తయ్య రండి లోపలికెళదాం" అంటూ అత్తగారి చేతిలోని ప్లాస్టిక్ బుట్ట అందుకుని లోపలికి దారితీసింది.

లోపలకి అడుగులేస్తున్నా...కళ్ళు మాత్రం టీవీ తెరమీది సీరియల్ మీదే ఉన్నాయి. కనీసం గుమ్మందాటి, లోపలికెళ్లేదాకానన్నా ఎంతవరకు కనబడితే అంతవరకు చూడాలని అటే చూస్తూ లోపలికి నడిచింది.

అత్తగారిని బాత్‌రూమ్‌కి పంపించి తాను మంచినీళ్ళ గ్లాసులు తీసుకుని మళ్ళా టీవీ ఉన్న హాల్‌లోకి వచ్చింది. మంచినీళ్ళు మరిదికి, మావగారికి అందించిందన్నమాటే గానీ చూపులు మాత్రం టీవీ సీరియల్‌మీదే ఉన్నాయి.

"అబ్బాయి ఎట్లా ఉన్నాడమ్మా" అని మంచినీళ్ళ గ్లాసు తిరిగిస్తూ మావగారు అడిగినట్లున్నారు. టీవీకే

చూపులు, చెవులూ అప్పజెప్పిన సరోజ వినలేదు. యధాలాపంగా "ఊ" అంది.

రాకరాక తామొస్తే కోడలు సరోజ ఎందుకలా పరధ్యాన్నంగా ఉందో ఆ పల్లెటూరి వ్యవసాయదారుని మనసుకి అర్థంకాలేదు కానీ...అంతకుమించి చెడుగా అనుకోని మావగారే సరిపెట్టుకుని ఊరుకున్నారు.

ఖాళీగ్లాసులు అలాగే పట్టుకుని నిలబడి టీవీనే చూస్తున్న కోడలి వంక చూస్తూ అత్తగారు, "ఇదుగో అమ్మాయి సరోజ...మరే..." అని అందరిముందు చెప్పలేక ఆగి, "ఇలా రా అమ్మాయి" అంది.

"ఆ..వస్తున్నా అత్తయ్యగారూ..." అంది గానీ టీవీలో జరుగుతున్న ఎపిసోడ్ జీడిపాకంలోంచి బయటపడలేకపోయింది. కాళ్లకడుక్కోను నీళ్ళు మావగారికి, బాత్‌రూమ్‌లో తనకి నీళ్ళున్నాయో లేదోనని పట్టించుకోని కోడలి ప్రవర్తనకి అత్తగారూ విస్తుబోయారు. కానీ ఆమే తమాయించుకుంది. అత్తగారి రెండో పిలుపుకి టీవీలోని సన్నివేశాన్ని వదిలిపెట్టక తప్పలేదు.

లోపలికి వచ్చిన సరోజతో అత్తగారు బాత్‌రూమ్ లో నీళ్ళు లేకపోవడంతో నీళ్లు కొట్టలేదని చెప్పలేక చెప్పింది. "ఏమ్మా నీళ్ళు సరిగా రావడం లేదా....గాబుల్లో నీళ్ళు లేవు. బక్కెట్లూ ఖాళీగా ఉన్నాయి." అంది.

"పరవాలేదత్తయ్యా...నేను కొడతాలే" అని మర్యాదా ఫోజు పెట్టి టీవీలో ఒకదాని వెంట ఒక సీరియల్స్‌తోనే టయం గడిచి, నీళ్ళు పట్టలేదన్న సంగతి తెలియకుండా జాగ్రత్తపడింది. సరోజ తానే పెరటిలోకెళ్ళి నీళ్ళు తోడి, బాత్‌రూమ్‌లో కొట్టింది.

"ఏవిటీ ఖర్మ బాత్‌రూమ్‌కి నీళ్ళుమోసే ఖర్మ" అని విసుక్కుంది. టీవీ సీరియల్ కోల్పోయాననే విసుగు ఇలా మార్పు చెందింది. ఆ తరువాత వచ్చే "అత్తగారి అంతరంగం" సీరియల్లన్నా చూడనిస్తారో లేదో ఈ మేళం. అయినా ఇప్పుడొచ్చి సచ్చారేంటి?...ఇలా ఆమెలోని టీవీ సీరియల్ ఆశాభంగం రకరకాల రూపాల మార్పు తీసుకుంటోంది, ఆ మార్పుల తాలూక ఛాయలు ఎంత దాచుకున్నా ఆమె ప్రవర్తనల్లో అక్కడక్కడా బయటపడుతూనే ఉన్నాయి.

బాత్‌రూమ్‌లో నీళ్ళుకొట్టి గబగబా టీవీ హాల్లోకి వచ్చింది. ఎండన పడి వచ్చిన మావగారు పంచె విప్పి లుంగీ కట్టి అక్కడే కాసేపు నడుం వాల్చే ప్రయత్నం చూసేసరికి సరోజకు చిర్రెత్తుకొచ్చింది.

"అత్తయ్యా...మావగారికి పడకమంచం వరండాలో వేస్తానని చెప్పండి. అక్కడయితే గాలివేస్తుందిగా" అనేసి వరండాలో మంచం వాల్చేందుకు వెళ్ళింది.

ఈసారి అత్తమావలిద్దరూ విస్తుబోయారు. తామెప్పుడొచ్చినా...ఈ హాల్లోనే ఫ్యాన్‌కింద మంచం వాల్చేది. ఈసారి ఎందుకిట్లా అంటోందోనని మనసులోనే బాధపడ్డారు.

సరోజ వంటప్రయత్నాలేవీ చేసేటట్టు కనబడలేదు. అత్తగారే..."అబ్బాయెప్పుడొస్తాడు సరోజా...ఆయనగారికి ఈ మధ్యన సుగరొచ్చిపడి

నప్పటినుంచి వెంటవెంటనే ఏవన్నా తినకపోతే నీరసవడిపోతున్నారు. కూరగాయలేవన్నా ఉన్నాయా...నేను వంట పనుల్లోకి వెళతాను" అంది.

"ఎందుకు నేను చేస్తాలేండి" అంటూ అతికష్టంగా అని, వంకాయలు, ఉల్లిగడ్డలు నీళ్ల గిన్నె లో వేసుకుని కత్తిపీటతో సహా టీవీ ముందుకు తెచ్చుకుని కూర్చుంది.

మరిది సత్యనారాయణ ఏ మాటావలుకూ లేకుండా దిక్కులు చూస్తూ...పోనీ ఇప్పుడన్నా వదిన ఇదివరకటిలా తనకు కబుర్లు చెబుతుందని అప్పుడప్పుడూ ఆమె వంక చూస్తున్నాడు. ఎప్పుడూ ఇలా లేదు. ఈసారేంటో తమను అనలు పట్టించుకోవట్లేదనుకున్నాడు.

వరండాలో మావగారు నడుంవాల్చారేగానీ కోడలు ప్రవర్తన అంతుబట్టడంలేదు. ఇది టీవీ తెచ్చిన తంటా అని తెలియదాయనకు. తమ రెండోవాడు సత్యనారాయణను కూడా పెద్దాడి దగ్గర అట్టేపెట్టితే ఏదన్నా ఉద్యోగం వేయిస్తాడేమోనని ముసలి వాళ్ళిద్దరూ ఓ పదిరోజులు పెద్దకొడుకు దగ్గరుండి వెళ్దామని వచ్చారు. బహుశా ఇది గిట్టక కోడలు అట్లా వుందేమనిపించిదాయనకు. ఇక అక్కడ పడుకోబుద్ధి కాలేదు. లేచి లుంగీ తీసి పంచె కట్టుకుని భార్యను, చిన్నకొడుకుని బయలుదేరమన్నాడు.

అదే ఊళ్ళో ఉన్న తన దూరబ్బంధువు ఇంట్లో ఏదో కార్యక్రమం ఉందని , అతను పిలిస్తే ఆ ఇంటికి వెళ్తూ ఒకసారి చూసి వెళదామనొచ్చామని చెప్పి బయలుదేరారు. అబ్బాయి వచ్చాక మేం వచ్చి వెళ్ళామని చెప్పమనిచెప్పి, తమ ఊరికి తిరిగి వెళ్ళిపోయారు.

అప్పటికి పూర్తిగా స్పృహలోకి వచ్చింది సరోజ. "ఆదేంటి మావయ్యా. వంట అయిపోతుంది కదా...భోంచేసి వెలుదురుగానీ..."అంది. అక్కడికెళ్ళి మళ్ళీ వచ్చి వెళ్ళమంది. మీ అబ్బాయిని చూడకుండానే వెళ్ళిపోతారా? అని కూడా అంది. కానీ ఏం లాభం. అప్పటికే వారి పెద్ద మనస్సులో పడాల్సిన అపార్థం పడిపోయింది.

ఆఫీసునుండొచ్చిన శ్రీనివాసరావుకి కూడా అతని తల్లీదండ్రీ, తమ్ముడొచ్చారన్న సంగతికూడా ఏదో సీరియల్లో వచ్చిన సన్నివేశం వల్ల మాత్రమే గుర్తొచ్చి,

"ఏవండీ...మీ నాన్న , అమ్మ, తమ్ముడు వచ్చి వెళ్ళార"ని చెప్పింది. తానొచ్చిన ఇంతసేపటికా చెప్పడం అని శ్రీనివాసరావు ఆశ్చర్యపోయాడు. ఇంత దూరం హైదరాబాదొచ్చి, తనకు కనబడకుండానే ఎందుకు వెళ్ళిపోవాల్సివచ్చిందో తెలియక సతమతమయ్యాడు.

✿ ✿ ✿

సరోజ, శ్రీనివాసరావులిద్దరూ ఎనిమిది సంవత్సరాలు ఒకే కాలేజీలో కలిసి చదువుకుంటూ ఒకరికొకరు ఇష్టపడి పెళ్లిచేసుకున్నారు. పెళ్ళయిన తరువాత కూడా ఎప్పుడు ఇలా ప్రవర్తించలేదు. కాని కొన్నిరోజులుగా ఇలా ప్రవర్తిస్తోంది.

సరోజ కుటుంబం ఆర్థికంగా కొద్దిగా ఉన్నవాళ్ళే. సహజంగానే సరోజవాళ్ళ అమ్మానాన్నకు ఈ పెళ్ళి ఎంత మాత్రం ఇష్టంలేదు. అయినా వాళ్లని ఎదురించి శ్రీనివాసరావుతో వచ్చింది. అతని తల్లిదండ్రుల సహాయంతో గుళ్లోపెళ్లి చేసుకుని కొన్నిరోజులకే బందరునుండి హైదరాబాద్‌కి మకాం మార్చారు. అతను ఒక ప్రైవేటు కంపెనీలో చిన్న జాబ్ సంపాయించాడు. సాయంత్రం ఆఫీసునుండి ఇంటికి రాగానే సరోజ గుమ్మంలోనే చిరునవ్వుతో ఎదురయ్యేది. ఎంత అలిసిపోయివచ్చినా తన మాటలతోనే హుషారు చేసేది. ఆఫీసు విషయాలు, బయటి విషయాలు అన్నీ అడిగిమరీ తెలుసుకునేది. సరోజ అంటే శ్రీనివాసరావుకి కూడా ఎంతో ఇష్టం. ఆమెతో మాట్లాడుతున్నంతసేపు టైమే తెలిసేది కాదు. ఎంత సేపు మాట్లాడినా ఇంకా మాట్లాడాలని అనిపించేది. అలాంటిది సరోజ అతనితో మాట్లాడి మూడు రోజులైంది. ఆమెతో ఎలాంటి తగాదా రాలేదు, ఆమె ఇంట్లోనే వుంటుంది. ఎక్కడికీ వెళ్ళడం లేదు. అతను కూడా ఆఫీసు నుంచి తొందరగానే పని ముగించుకొని వస్తున్నాడు. సరోజతో ఒకరోజు మాట్లాడకపోతే ఒక యుగంలా ఉంటుంది. అలాంటిది మూడురోజులు గడిచిపోయింది. ఏదిఏమైనా ఈరోజు కచ్చితంగా మాట్లాడాలని ఆలోచనల పర్వం నుండి బైటపడి మెల్లగా సోఫాలో నుంచి లేచాడు.

ఉదయం నుంచి ఏం తిననందునా బాగా నీరసంగా వుంది. అలాగే లోపలికి నడిచాడు. సరోజ టీవి ముందు కూర్చునివుంది. సరోజ అని రెండుమూడు సార్లు పిలిస్తేకాని తనవైపు చూడలేదు.

"ఉదయం నుండి ఏం తినలేదు. బాగా ఆకలేస్తోంది. కాస్త భోజనం పెడతావా."

"అయ్యో సారీ అండీ... 'వంటింట్లో వంకాయకూర' సీరియల్ చూస్తూ వంటచేయడం కుదర్లేదు. నేను కూడా భోజనం చేయ్యలేదు. హోటల్‌కెళ్లి తీసుకురండి. కలిసి తిందాం" అని మళ్ళీ సీరియల్‌లోకి లీనమైపోయింది.

"అబ్బా...ఆ టీవీ మోజులో పడి నన్ను , ఈ ఇంటిని, చివరికి నిన్ను నీవే మర్చిపోతున్నావు కదా. ఇకనైనా ఆ టీవీ కట్టేస్తావా?"

"ముందు మీరు భోజనం పట్రాండీ."

"తేక చస్తానా..."అంటూ ఆవేశంగా బయటికెళ్ళి భోజనం ప్యాకెట్‌తో వచ్చాడు శ్రీనివాసరావు.

బాగా ఆకలిగా వుండటంతో ఇద్దరూ ఏం మాట్లాడకుండా భోజనం చేస్తున్నారు. గోడగడియారం రెండు గంటలు చూపిస్తూ బెల్ మోగింది.

"అబ్బా... అప్పుడే రెండయిందా" అంటూ సరోజ భోజనం సరిగ్గా చేయకుండానే చేయి కడిగేసుకుంది.

"ఏంటీ ఆ తొందర... ఎక్కడికి?"

"అయ్యో 'నట్టింట్లో నరకం' సీరియల్ వచ్చే టైం అయ్యిందండి. మీరు తృప్తిగా భోజనం చేసి రండి" అంటూ వెళ్లి టీవీ ముందు కూర్చుంది.

చాలా రోజుల తర్వాత సరోజతో ఎక్కువ మాట్లడింది ఈరోజే. ఈ ఇంట్లో టీవీ రోజుకు 18 గంటలు నడుస్తూనే వుంటుంది. మొన్న టీవీ చూసుకుంటూ కూరగాయలు కోస్తే, వేలు తెగి నానా హంగామా చేసింది. తను ఆఫీసుకు వెళ్తే ఇంట్లో సరోజ ఒంటరిగా ఎంతసేపని వుంటుంది. టీవీ వుంటే కొద్దిగా కాలక్షేపంగా వుంటుందని రెండు నెలల క్రితం 8వేలు పెట్టి తెచ్చాడు. టీవీ వచ్చిన వారం రోజుల వరకు సరోజ బాగానే వుంది. క్రమంగా వాళ్ళ మధ్య మాటలు తగ్గడం ప్రారంభమయ్యింది. ఖాళీగా వుంటే టీవీ ముందు కూర్చుండిపోతుంది.

అతనితో సరిగ్గా ఉండటం లేదు. వాళ్ళ పెళ్లికి సరోజ తల్లిదండ్రులు ఒప్పుకోకపోతే తానే అన్నది. మనల్ని ఎవ్వరూ విడదీయలేరండి. మనం జన్మ జన్మలకు కలిసే వుంటాం అంది. "ఆనాటి మాటలన్నీ గాలిలో కలిసిపోయాయి. ఈ టీవీ మమల్ని విడదీయడానికే దాపురించిదా" అనుకుంటూ చేయి కడిగేసుకుని వెళ్లి హాలులోని సోఫాలో నడుం వాల్చాడు.

"మళ్లీ నా సరూ నాతో ప్రేమగా మాట్లాడే రోజులు వస్తాయా?" అని తీవ్రమైన ఆవేదనతో ఆలోచిస్తుంటే గుండె బరువుగా మారింది. ఇవాళ సరోజతో ఎన్నో విషయాలు మాట్లాడాలని ఆఫీసు పని తొందరగా ముగించుకుని మధ్యాహ్నానికే ఇల్లుచేరాడు. అయినా లాభం లేకపోయింది. ఆ టీవీ అమ్మేద్దామనుకుంటే సరోజ బాధపడుతుంది. ఈ సమస్యకు పరిష్కారం లభించేదెలా?" అని తీవ్ర ఆలోచనలలో కొట్టుకుపోతున్నాడు శ్రీనివాసరావు.

సడన్‌గా "ఢాం..." అని పెద్దశబ్దం... ఆ వెంటనే పెద్ద గావు కేక!

ఉలిక్కిపడిలేచి ఇంట్లోకి పరుగెత్తాడు. ఇల్లంతా చిందర వందరగా వుంది. టీవీ ముక్కలుముక్కలై అందులోనుండి పొగలు, మంటలు వస్తున్నాయి. ఆలా అంతదూరాన సరోజ నక్కి కూర్చుని వుంది.

"ఏమైంది సరోజ... నీకేం కాలేదుగా..."

"ఏమండీ... నా టీవీ, నా సీరియల్" అంటూ ఏడ్వడం మొదలుపెట్టింది.

"కొద్దిగా నీ ఏడుపు ఆపుతావా... రోజుకు 18, 19 గంటలు టీవీ ఆన్‌లో వుంటే ఏమవుతుంది పేలిపోక" అంటూ నీళ్లు తెచ్చి మండే ఆ టీవీ ముక్కలపై పోసాడు.

మరుసటిరోజు ఉదయన్నే లేచి వడివడిగా స్నానంచేసి ఆఫీసు బయలుదేరాడు శ్రీనివాసరావు.

"ఏమండీ ఈరోజు తొందరగా వస్తారా" అంది సరోజ.

"ఏం ఎందుకు"

"టీవీ లేదుగా... ఒక్కదానికి బోర్‌గా వుంటుంది."

"ఆ...అలాగే" అని బయటికి అడుగేసాడు.

చాలారోజుల తర్వాత సరోజతో హాయిగా గడిపే అవకాశం వచ్చిందనుకున్నాడు.

సరోజకూడా చాలా రోజుల తరువాత తనూ తన కుటుంబం, తన అత్తమామలు, మరిది, తన తల్లీదండ్రుల గురించి ఆలోచించే తీరిక దొరికింది. ఆ తీరికలోనే పదిహేను రోజుల క్రితం తన అత్తమామలొస్తే తన ప్రవర్తన గుర్తొచ్చింది. అరే అలా చేశానా...అని కొద్దిసేపు బాధపడింది.

శ్రీనివాసరావు అత్తమామలకు వాళ్ళంటే కోపం పోయింది. త్వరలో వస్తామని నిన్ననే ఫోన్ చేసారు. దారిలో ఒకటే ఆలోచనలు. ఆఫీసుకు వెళ్ళటంతోనే మేనేజర్‌గారి రూమ్‌లో కెళ్ళి, "సార్ అర్జెంట్ పనివుంది. ఈరోజు సెలవు కావాలి" అని రిక్వెస్ట్ చేసాడు.

"సరేలే.. ఈ ఫైల్ ఒక్కటి చూసి వెళ్లు" అన్నాడు.

తొందరతొందరగా పని ముగించేసుకుని 12గంటలకల్లా ఇల్లు చేరాడు. గతంలో లాగా గుమ్మంలో సరోజ ఎదురొతుందని అనుకున్నాడు. కాని అలా జరగలేదు.

ఏప్పటిలాగే లోపల గోల. బైట రెండు జతల చెప్పుల జోళ్లు చూసి, ఏవరో వచ్చి వుంటారని లోపలకెళ్ళాడు. ఎదురుగా అత్తగారు, మామగారు.

"అరే! మీరెప్పుడొచ్చారు. అంతా కులసానేగా" అన్నాడు. "మీరెల్లా ఉన్నారు అల్లుడుగారు ... ఆఫీసునుంచే వస్తున్నారా?"

"అవునండి." అంటూ ఇంట్లో కొత్తగా వచ్చిన వస్తువుల వైపు చూస్తున్నాడు. కొత్త కొత్త ప్యాకులతో కొన్ని వస్తువులు కనిపించాయి.

"ఏంటివన్నీ" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఇవన్నీ మేమే తెచ్చామయ్యా... మీపెళ్లికి ఎలాగూ పెట్టలేదుగా అని వస్తూ వస్తూ దారిలో ఫ్రిజ్జు, టీవీ ఇంకా కొన్ని సామాన్లు అమ్మాయిని అడిగే పట్టుకొచ్చానులే." ఆ మాటలు వినగానే టీవీలో కనబడే రంగులన్నీ శ్రీనివాసరావు ముఖంలోనే కనబడ్డం ప్రారంభించాయి. ❖

పిల్లలు కాదు... పిడుగులు

అంపశయ్య నవీన్

“యేమండీ రచయిత గారూ... బావున్నారా?”

“బాగానే ఉన్నాను... మీరేమిటి అలా ఉన్నారు.”

“ఎలా ఉన్నాను.”

“కొంచెం దిగులుగా... కొంచెం బాధగా...”

“యేం చేస్తాంలెండి... పీత కష్టాలు పీతవి”

“ఇప్పుడు మీకొచ్చిన కష్టమేమిటో?”

“ఎన్నని చెప్పమంటారు... అన్నీ కష్టాలే... నేనెన్ని కష్టాల్లో ఉన్నానో మీరు నా ముఖం చూసే చెప్పొచ్చు...”

“అయ్యో! మీ మొఖానికేమయ్యింది. నేనింతసేపూ గమనించనే లేదు నుదిటి మీద ఆ గాటేమిటి?”

“అది మా మనవడి నిర్వాకం”

“మీ మనవడి నిర్వాకమా? యేం చేశాడు వాడు?”

“కంకర రాయితో విసిరికొట్టాడు. మొఖం పచ్చడైపోయింది”

“ఎందుకొట్టాడు”

“వాడికి సెల్‌ఫోన్ కొనివ్వాలట. ఆరేండ్లు కూడా లేవు... నీకప్పుడే సెల్‌ఫోనెందుకురా అన్నాను. అంతే రోడ్డుమీదికి పరిగెత్తి అక్కడున్న ఓ కంకరరాయిని తీసుకొని విసిరేశాడు. అదొచ్చి నా నుదిటికి తాకింది...”

“ఆరేళ్ళ కుర్రాడు... ఇంత సాహసం చెయ్యడమా?!”

“ఆరేళ్ళ కుర్రాడేం ఖర్మ. ఈ తరం పిల్లలు పుట్టినప్పట్నించే సాహసవీరులుగా పుడ్తున్నారు. ఆ క్షణంలో మా మనవడి చేతిలో పిస్తోలు లేదుగానీ ఉంటే కాల్చేసేవాడే”.

“అవును... మొన్ననే చూశాంగా. అమెరికాలో ఓ కుర్రాడు వాళ్ల స్కూల్లోకెళ్ళి చేతిలో ఉన్న గన్‌తో పన్నెండుమంది తనతోటి విద్యార్థుల్ని కాల్చిచంపేశాట్ట.”

“అమెరికా కల్చరంతా మనకూ వచ్చేస్తున్నదిగదా. మన పిల్లలు కూడా అలాగే తయారవుతున్నారు. వాళ్ళు ఆడింది ఆట... పాడింది పాట...”

“మీ మనవడంటే... మీ కొడుకు కొడుకా? మీ కూతురు కొడుకా?”

“కూతురు కొడుకండీ. మా అమ్మాయి, మా అల్లుడు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. వీడ్నేమొ మా దగ్గరుంచారు. వీడు చదువులో చాలా తెలివైనవాడే... వాడి జనరల్ నాలెడ్జి అద్భుతం. మీరేదడిగితే అది టకీమని చెప్పేస్తాడు. రోజూ టి.వీలో వచ్చే ప్రోగ్రామ్స్ అన్నీ చూస్తాడు. డిస్కవరీ, నేషనల్ జియోగ్రాఫిక్, ఎం.టీ.వీ,ఏ ఎక్స్ ఎన్‌టీవి, జీటీవీ... ఒకటనేం లేదు. అన్నీ చూస్తాడు. వాళ్ళ అమ్మా నాన్నలతో రోజుకో పదిసార్లు వాళ్ళ మొబైల్స్‌కి ఫోన్ చేసి మాట్లాడ్తాడు. వాళ్ళను నాకిది కావాలి. అది కావాలి. అని అడుగుతాడు. వీడు యేదడిగితే అది వాళ్ళు వెంటనే ఇచ్చేస్తారు. తాతయ్య నడిగి తీసుకో అని చెబుతారు. వీడు నా వెంట పడ్తాడు. వీడన్నదాన్ని క్షణాలమీద తెచ్చి వాడి ముందు పెట్టాలి. యే కొంచెం ఆలస్యమైనా మన మొఖం ఇలా పగుల గొడ్తాడు.”

“మీ అమ్మాయి, మీ అల్లుడు వాడ్ని బాగా గారాబం చేస్తున్నట్టున్నారు. అతి గారాబం చేసి ఈనాటి తల్లిదండ్రులు పిల్లల్ని పాడు చేస్తున్నారేమో... కొంచమైనా హద్దూ పద్దూ ఉండాలి కదా”

“హద్దులేదు పద్దులేదు... పిల్లల్ని కొట్టొద్దట... కోప్పడద్దట. వాళ్ళు యేదడిగితే అది తెచ్చివ్వాలట... లేకపోతే వాళ్ళు యే అఘాయిత్యానికైనా వెనుకాడరట. ఈ మాటలు మా అమ్మాయి నాకెప్పుడూ చెబుతుంటుంది. పిల్లలకి తమ తల్లిదండ్రులు తమని కొట్టరని కోప్పడరని అర్థమైపోయింది. దాంతో వాళ్ళు అనుక్షణం పెద్దవాళ్ళని వేధించుకుతింటున్నారంటే నమ్మండి...”

“నిజమే పరిస్థితులిలా మారటానికి కొన్ని కారణాలు కనిపిస్తున్నాయి. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నప్పుడు పిల్లల బాధ్యతల్ని ఇంకొకరికి అప్పగిస్తుంటారు. తాతయ్యో... అమ్మమ్మో పిల్లల్ని చూడాలి. అమ్మమ్మలూ నాయనమ్మలు పిల్లల్ని మరీ గారాబం చేస్తారు. వాళ్ళమీద ఈగను కూడా వాలనివ్వరు. ఉద్యోగం చేసే వాళ్ళ తల్లిదండ్రులు త్వరగా ఆఫీసులకు వెళ్ళాలి. కాబట్టి పిల్లల్ని బుజ్జగించి వాళ్ళు యేదడిగితే అది ఇచ్చేసి వెళ్ళిపోతారు. ఇద్దరూ ఉద్యోగాలు చేస్తారు. కాబట్టి డబ్బుకు కొదవలేదు. పిల్లలకు వాళ్ళు అడిగిందల్లా ఇచ్చేటప్పటికి తమ తల్లి దండ్రులు బాగా డబ్బున్నవాళ్ళని వాళ్ళకర్థమై పోతుంది. దాంతో వాళ్ళ తల్లిదండ్రుల దగ్గర్నుంచి వాళ్ళకు కావలసినవన్నీ రాబట్టుకోవాలని తెలిసి పోతుంది. అడిగిన దాన్ని వెంటనే తెచ్చివ్వకపోతే ఇల్లుపీకి పందిరేస్తారు. ఆత్మహత్య చేసుకుంటామని బెదిరిస్తారు. చేతిలో యేదుంటే అది మన మీదకు విసిరికొడ్తారు”.

“అవునండీ! ఇవాల్టి పసిపిల్లలు పిల్లలుకాదు... పిడుగులండీ... ఎవరిచేతిలో చూసినా సెల్‌ఫోన్లు, మోటారు సైకిళ్ళు, కంప్యూటర్లు, సీడీ ప్లేయర్స్‌లో మ్యూజిక్ సీడీలు పెట్టుకొని డాన్సులు చేస్తారు. యేడెనిమిదేళ్ళు కూడా నిండని ఆడపిల్లలు సినిమాల్లో లాగా సెక్సీడాన్సులు చేస్తోంటే మనం కళ్ళు మూసుకోవాల్సి వస్తున్నది. కొన్ని తెలుగు ఛానెల్స్‌లో పెద్దాళ్ళే తమ పిల్లలచేత డ్యాన్సు బేబీ డాన్సులు అంటూ చేయిస్తున్నారు. పదో తరగతో, ఇంటర్మీడియెట్టో చదువుతున్న ఆడపిల్లలూ, మొగ పిల్లలూ కలసి డాన్సులు చెయ్యడం. షికార్లకెళ్ళడం. ప్రేమలో పడిపోవడం తల్లిదండ్రులకు చెప్పకుండానే పెళ్ళిళ్ళు చేసుకోవడం. యేమిటీ సంస్కృతి? మనం ఎక్కడకు వెళ్తున్నాం. పసిపిల్లల్ని కొంచెమైనా క్రమశిక్షణతో పెంచకపోతే ఈ దేశం యేమైపోతుంది?” ❖

యాసలపు సూర్యారావు

పిట్ట కొంచెం - కూత ఘనం

నవీన్ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. అతను నిరుపేద కుటుంబంలో పుట్టాడు. అందువల్ల చదువు సాగడానికి ఇబ్బందిగా వుంది. కాలేజీలో స్కాలర్‌షిప్ కోసం అప్లికేషన్ పెట్టాడు. కాని రాలేదు. కలెక్టర్ గారికి అప్లికేషన్ ఇచ్చి స్కాలర్ షిప్ మంజూరు చేయమని అడుగుదామని కలెక్టరేట్‌కు వెళ్లాడు. అక్కడ విపరీతమైన జనం. ఆరోజు పిటీషన్లు తీసుకునే రోజు.

కలెక్టర్ ఆఫీస్‌కు వెళ్లడం నవీన్‌కు ఇదే మొదటిసారి. ఎవరయినా వెళ్లినప్పుడు కూడా వెళ్దామని చూస్తున్నాడు ఒక చోట కూర్చుని. ఎదురుగా కొద్ది దూరంలో ఒక వ్యక్తి కారు తుడుస్తున్నాడు. నవీన్ చూపు అటు పడింది. కారు తుడిచే వ్యక్తి ఒక్కసారి ఆ గుడ్డను రెండు చేతులతో విప్పి విదిలించాడు. అప్పుడు అది చూసిన నవీన్‌కు బాగా కోపం వచ్చింది. వెంటనే కింద వున్న ఒక రాయి తీసుకుని కసికొద్దీ కారును తుడిచే వ్యక్తిని కొట్టాడు. రాయి తగిలి అతనికి తల తిరిగినంత పనయింది. తలకి బొప్పి కట్టింది. ఇది గమనించిన జనం "ఏమిటా?!" అని ఆశ్చర్యంగా చూస్తున్నారు. అప్పుడు నవీన్ మనసు తృప్తి పడింది. దెబ్బ తగిలిన వ్యక్తి కసిగా నవీన్ వైపు దూసుకుని వచ్చాడు. నవీన్‌ను కొట్టడానికి చెయ్యి పైకెత్తాడు. అది చూసిన చుట్టుపక్కలవారు "పోనీ బాబు! చిన్న కుర్రాడు, ఏదో తెలీక చేశాడు" అని వారించారు.

"అసలు నన్నెందుకు కొట్టాడో తెలియాలి" అన్నాడు ఆ వ్యక్తి. నవీన్ మౌనంగా వున్నాడు గుండె నిబ్బరంగా. దాంతో ఆ వ్యక్తికి కోపం ఎక్కువైంది. నవీన్‌ను బరబరా కలెక్టర్‌గారి రూము దగ్గరకు ఈడ్చుకెళ్లాడు. "సార్! వీడెవడో ఆకతాయి పనులు చేస్తున్నాడు. నన్ను కొట్టాడు చూడండి" అంటూ తలకు కట్టిన బొప్పిని చూపించాడు. దాంతో కలెక్టర్‌కు కూడా కోపమొచ్చింది. "అతణ్ణి ఎందుకు కొట్టావ్?" అన్నారు కటువుగా. అందుకు నవీన్ ఏమాత్రం జంకకుండా "అతను మన జాతీయ జెండాతో కారు తుడుస్తున్నాడు సార్. అందుకే తట్టుకోలేక కొట్టాను. మన జాతీయ పతాకాన్ని అవమానించడం తప్పు కదా సార్?" అన్నాడు నవీన్ వినయంగా.

అందుకు కలెక్టర్ వెంటనే అతనికేసి చూస్తూ "నువ్వు జాతీయ జెండాతో కారు తుడిచావా..?" అని అడిగారు. దానికి అతను అవునన్నట్టుగా తలూపాడు. అంతే! వెంటనే చాచి కొట్టారు. "జాతీయ జెండాతో కారు తుడుస్తావా... నీలాంటివాడు నా కారు డ్రైవర్‌గా తగడు. నిన్ను సస్పెండ్ చేస్తున్నాను వెళ్లు" అన్నారాయన.

అక్కడ వున్న వారంతా ఆశ్చర్యపోయారు. అప్పుడు తెలిసింది. ఆ కుర్రాడు అతన్నెందుకు కొట్టాడో. అంతలో కలెక్టర్ "బాబూ! నువ్వు ఇక్కడికెందుకొచ్చావు?" అని అడిగారు.

అందుకు నవీన్ "నేను పేదవాణ్ణి. నా తల్లిదండ్రులు కూలి

పనిచేస్తూ నన్ను చదివిస్తున్నారు. నాకు స్కాలర్‌షిప్ కూడా మంజూరు కాలేదు. అది మీకు విన్నవించుకుందామని వచ్చాను" అన్నాడు.

"నీ దేశభక్తికి నేను నిన్ను అభినందిస్తున్నాను" అని జేబులో నుండి 500 రూపాయలు తీసి నవీన్ చేతిలో పెట్టాడు.

"వద్దు సార్" అన్నాడు నవీన్ మొహమాటపడుతూ.

"ఫర్వాలేదులే వుంచు. నీ పేరేంటి?" అని అడిగారాయన.

"నవీన్" చెప్పాడు.

"చూడు నవీన్! ఇక నుండి నువ్వు నిశ్చింతగా చదువుకోవచ్చు. నీ చదువు పూర్తయ్యే వరకూ ఖర్చు నేను ఇస్తాను. ఇకపై బాగా చదువుకో. నీకు స్కాలర్‌షిప్ కూడా వచ్చే విధంగా చేస్తాను. ఆ ఫారాలు ఇలా ఇవ్వు" అన్నారు.

కృతజ్ఞతాపూర్వకంగా ఆయనకు రెండు చేతులతో నమస్కరించాడు నవీన్.





వి'చిత్రం'

పిడుగులూ...

ఇవాళ మీ ముందుకు ఒక వి'చిత్రం' వచ్చిందికదా. ఇందులో అమెరికన్ అధ్యక్షుడిగా చేసిన జార్జ్ వాషింగ్టన్ సమాధి వుంది. కాకపోతే ఆయన బొమ్మనుకూడా గీసేశాడు ఆర్టిస్ట్ అంకుల్. ఇంతకీ వాషింగ్టన్ బొమ్మ ఎక్కడుందో కనుక్కోండి చూద్దాం. తెలీకపోతే జవాబు చదువుకోండే.



జవాబు: ఏంటి వాషింగ్టన్ కనిపించలేదా? బొమ్మకు ఎడమవైపు ఒక చెట్టు వుందికదా. సరిగ్గా అక్కడే ఆయన చేతులు కట్టుకుని నిలబడి వున్నాడు కనిపించాడా!

ఏ గాలిపటం దేనిది?



(జవాబు: ఎ-2, బి-3, సి-5, డి-1, ఇ-4)

రంగులు పూసేద్దాం

మొత్తం ఇళ్లు ఎన్ని?



వీరి వీరి గుమ్మడిపండు...

వీరి పేరేమి?

హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చిన వ్యక్తి గొప్ప కమ్యూనిస్టు నాయకుడు. కాకపోతే ఫొటో చిన్నప్పటిది. ఆయనను ప్రేమతో **పిఎస్** అని పిలిచేవారు. మరైతే ఆయన పేరేంటో కార్డు మీద రాసి పంపండి. సరైన సమాధానమైతే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. ఓకేనా. ఈ పని ఇవాళే ఇప్పుడే చెయ్యాలని తెలుసుకదా. మా చిరునామా: **వీరి వీరి గుమ్మడిపండు**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాద్.

7.5.05కు

సరైన సమాధానం రాసినవారు

పి. అమర్ జయసింహ, గవరపాలెం. జి.సాయిభరత్‌రెడ్డి (6), వెూదుకూరు. వి.లెనిన్ (7), రొంపిచెర్ల. జి.పన్నగవల్లి (6), చైతన్యపబ్లిక్ స్కూల్, మంగళగిరి. ముల్లా ఆరీఫ్ (5), కోటవీధి, కొడుమూరు. ఎం.అశోక్‌కుమార్, అనూష, తేజ, సైదయ్య, కాన్సెప్ట్ స్కూల్, కోదాడ. సబియా (7), టి.సాయిరాం (6), బండిమెట్ట. టి.సాయిరాం (6), బోనకల్. జె.జైహింద్ యాదవ్ (8) , పడకల్. పి.ఆకాష్‌రెడ్డి, యుకెజి, అభ్యుదయనగర్, అద్దంకి. కె. శ్రీతన్మయ (2), గుంటూరు. ఎ.కృష్ణచైతన్య (3) , సత్తెనపల్లి. ఎ.స్వాతి, పి.ప్రత్యూష (7), బెల్లంపల్లి. ఎస్.రవి ప్రసన్న కుమార్ (9), క్రాంతి కాన్వెంట్, కొండపల్లి, ఎం.అభిషేక్ (3), ఎం.అవినాష్ (8), కంచరాం. ఎం. రుషేంద్రకుమార్‌రెడ్డి (1), బేతం వెంకటరెడ్డి(9), పార్కురోడ్, విజయవాడ.

గతవారపు జవాబు

కందుకూరి వీరేశలింగం

చిన్నారి చిత్రకారులు



తెల్లమేకల సీయోన్ కుమార్,
7వ తరగతి, ఎస్ఎస్ఆర్ఎం
బధిరుల పాఠశాల,
నాగులపాలెం, పర్చూరు,
ప్రకాశం.



ఉడుతూరి గోపీనాథ్ రెడ్డి,
1వ తరగతి, ఎస్ఎస్ఆర్ఎం
బధిరుల పాఠశాల,
నాగులపాలెం, పర్చూరు,
ప్రకాశం.

ఎం.డి. వహీద్,
10వ తరగతి,
శ్రీశారద విద్యామందిర్,
వనపర్తి, మహబూబ్‌నగర్.

చుక్కలు కలిపితే...





గడదొక్కా వేసుకున్న ముస్లిము వాల్మీకితో ఫరీద్

పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ

మానవతావాది

మధ్నాహ్నం ఎండ తీవ్రంగా ఉంది.
ఆకాశంలో సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు.
షహరాన్‌పూర్ పట్టణం ప్రశాంతంగా ఉంది. మిట్ట మధ్యాహ్నం కావడంతో జనసంచారం తక్కువగా ఉంది. మెయిన్ రోడ్డులో షాపులు కూడా ఖాళీగా ఉన్నాయి.
హఠాత్తుగా అరుపులు వినిపించాయి.
కొట్టండి... తన్నండి... అంటు కేకలు వినిపించాయి. మెయిన్‌రోడ్డులో అందరూ ఉలిక్కిపడ్డారు.
మళ్లీ ఏ ఉపద్రవమో ముంచుకు వచ్చిందని బయపడ్డారు.

అంతలో ఒక యువకుడు ప్రాణభయంతో పరుగెడుతున్నాడు. అతని వెనుక అయిదారుగురు వ్యక్తులు కత్తులు తల్వార్లు పట్టుకుని వెంటాడుతున్నారు. వారి కళ్లల్లో కసి, కోపం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. దొరికితే ముక్కలు ముక్కలుగా నరకడానికి సిద్ధంగా ఉన్నారు.

పరుగెడుతున్న యువకుడి పేరు వాల్మీకి. ఆ గ్రామానికి కొత్తగా వచ్చాడు.

బంధువుల ఇంటిలో ఉన్నాడు. పట్టణంలో షాపింగ్ చేయడానికి బయలుదేరాడు. ఆ సమయంలో రోడ్డుపైన ఒక గుంపు కొట్లాడుకుంటోంది. పది పదిహేను మంది ట్రాఫిక్‌కు అంతరాయంగా నడిరోడ్డుపైనే వాదులాడుకుంటున్నారు. మతపరమైన గొడవలకు కేంద్రమైన ఆ గ్రామంలో అటువంటి దృశ్యాలు నిత్యం కనిపిస్తుంటాయి. ఎదిరించి లాభం లేదని తలవంచుకుని పక్కకు తప్పుకుని అక్కడివారు వెళ్లిపోతుంటారు.

వాల్మీకికి వారి విషయం తెలియదు.

అటువంటి వాతావరణం అంటే అతనికి గిట్టదు. అందుకే వారి దగ్గరికి వచ్చి "బాబు! అందరూ నడిచే రోడ్డుమీద ఏమిటీ గొడవలు. కాస్త పక్కకి వెళ్లండి!" అన్నాడు.

వారెవరూ వాల్మీకి మాటల్ని పట్టించుకోలేదు.

కత్తులు, కటార్లు పట్టుకున్నవారు ఒకర్నొకరు చంపుకుంటారేమోనని వారి వద్దకి వెళ్లి మళ్లీ అభ్యర్థించాడు.

"రోడ్డులో నీకు దారి ఇవ్వాలా? ఏం పెద్ద మొగాడివా? ఎక్కడి నుంచి వచ్చావురా?" అంటూ ఆ గుంపులో వ్యక్తి పెడీమని వాల్మీకి మొహం మీద కొట్టాడు.

వాల్మీకి షాక్ నుంచి తేరుకోకముందే గుంపులోని కొందరు "కొట్టండి... చంపండి... మన మీదే తిరగబడుతున్నాడు" అంటూ అరిచారు.

దాంతో గొడవ పడుతున్న గుంపులోకి వ్యక్తుల దృష్టి వాల్మీకి వైపు మళ్లింది. చేతుల్లో ఉన్న కత్తులు, తల్వార్లు పట్టుకుని వాల్మీకి వైపు తిరిగి వెంబడించారు.

ఈ పరిస్థితిని ఏ మాత్రం ఊహించని వాల్మీకి పరుగు లంకించుకున్నాడు. కొత్త ప్రదేశం... సందులు గొందులు తెలియవు. తిన్నగా ముందుకు ఉరికాడు. వారి ఆవేశం చూసిన తర్వాత ప్రాణాలు తీయడం వారికి ఏ మాత్రం కష్టం కాదని తెలుసుకున్నాడు.

వారికి దొరికినట్లయితే తన ప్రాణం గాలిలో కలిసిపోతుందని తెలుసుకున్నాడు. కత్తులతో మీదకు రావడంతో ప్రాణభయంతో పరుగులు తీయడం మొదలుపెట్టాడు.

ఆ గ్రామంలో రెండు ఖురేషీ కుటుంబాల మధ్య తలెత్తిన గొడవ వీధుల్లోకి వచ్చింది. అది రెండు వర్గాల కలహంగా తయారైంది. ఉరుము ఉరిమి మంగళం మీద పడినట్లు గొడవ వాల్మీకి మీద పడింది.

వీధుల్లో పరుగులు పెట్టాడు. రక్షించమని ప్రతి ఒక్కరినీ వేడుకున్నాడు. కానీ ఎవరి నుంచి అసలు స్పందనే కనిపించలేదు. మాకెందుకు ఈ గొడవ అంటూ ఎవరూ ముందుకు రాలేదు.

కత్తులకు బలయ్యే సమయంలో ఫరీద్ ఆత్మబంధువులా, ఆపద్బాంధవుడిలా ప్రత్యక్షం అయ్యారు. వాల్మీకికి అల్లరిమూకకు మధ్య నిలబడ్డాడు. పారిపోతున్న వాల్మీకికి ధైర్యం చెప్పి అక్కడే నిలుచోమని చెప్పాడు. ఏమీ కాదని అంతా తాను చూసుకుంటానని చెప్పాడు. అంతవరకూ ఆ పట్టణంలో అటువంటి వ్యక్తులు ఎవరూ వాల్మీకికి తారస పడలేదు. రక్షించమని చెప్పినా ఎవరూ ముందుకు రాని పరిస్థితుల్లో అండగా నిలబడే వ్యక్తి కన్పించడంతో వాల్మీకి ధైర్యం తెచ్చుకున్నాడు. రోడ్డుపక్క ఆగిపోయాడు.

ఫరీద్ రోడ్డుకు అడ్డంగా నిల్చుని కత్తులు, తల్వార్లతో అరుచుకుంటూ ఆవేశం, ఉన్మాదంతో వస్తున్న గుంపును అడ్డగించి ఎదురుగా నిలబడ్డాడు. ఈ పరిస్థితిని ఆందోళనకారులు గుర్తించలేదు.

పరుగు పరుగున వస్తున్నవారు ఆగిపోయారు.

"మీరు మత కలహాలను రగిలించాలని

చూస్తున్నారా? ఎందుకిలా వెంటపడుతున్నారు? ఏమైంది మీకు?" అంటూ వారితో వాదనకు దిగాడు ఫరీద్.

ఎవరు అడ్డం వస్తే వారిని ఖతం చేయాలన్న ఆవేశంతో ఆ గుంపు ఉద్రేకంతో ఉంది. వారు చెపుతున్న మాటలకు వరుసగా సమాధానాలు చెప్పాడు. అంతవరకూ ఎందుకు తాము పరుగులు పెడుతున్నామో తెలియని కొంతమంది వాస్తవ పరిస్థితిలోకి వచ్చారు. ఎదురుగా అమాయకంగా నిల్చున్న వాల్మీకిని చూసి వారి ఆవేశం సగానికి సగం తగ్గిపోయింది.

"ఎందుకు చంపాలనుకుంటున్నారో, ఎవరిని చంపాలనుకుంటున్నారో మీకు తెలియడం లేదు. ఆవేశం మాని కాస్త ఆలోచన చేయండి. వాస్తవ పరిస్థితులను చూడండి. ఎవరిమీద కోపం ఎవరిపైన చూపిస్తున్నారో గుర్తించండి?" అని బోధపరిచాడు.

తల్వార్లు ఊపుతూ ఆవేశంతో పరుగులు తీస్తూ వచ్చిన గుంపులోని వ్యక్తులకు ఫరీద్ మాటలు ఎంతో ఆసక్తిని కలిగించాయి. వాస్తవ పరిస్థితుల్లోకి వచ్చి ఆవేశాన్ని తగ్గించుకున్నారు.

మూలనున్న వాల్మీకిని పిలిచి అతను ఎవరు, ఎక్కడివాడు అన్న విషయాలను తెలుసుకున్నాడు. గుంపులోని వ్యక్తులందరికీ షేక్‌హ్యాండ్ ఇప్పించి పరిస్థితిని శాంతపరిచాడు. వాల్మీకిని బంధువుల ఇంటికి పంపించాడు. గుంపులో వ్యక్తులను వెనక్కి పంపించాడు.

తాను రావడం ఆలస్యమైతే వాల్మీకి అనే అమాయకుడు, ఉన్మాదుల ఆవేశానికి బలి అయిపోయేవాడు. సకాలంలో వచ్చి ఒక నిండు ప్రాణాన్ని రక్షించినందుకు ఫరీద్‌కు ఒకలాంటి సంతృప్తి కలిగింది.

ఆ రోజు మంచి పనిచేశానని ప్రశాంతంగా నిద్రపోయాడు.

❁ ❁ ❁

షహరాన్‌పూర్ పట్టణంలో ఫరీద్ మధ్య తరగతి ముస్లిం కుటుంబంలో జన్మించాడు. చిన్నప్పటి నుంచి గొడవలు, కొట్లాటలు లేని పరిస్థితుల్లో పెరిగాడు. ఇంటి చుట్టుపక్కల అంతా ముస్లింలే నివశిస్తుండంతో వారి ప్రాబల్యం అతనిమీద ఎక్కువగా ఉండేది.

ఇంటికి పెద్దవాడు అయినందున కుటుంబభారం అంతా ఫరీద్ ఒక్కడే మోసేవాడు. ప్రతిరోజు మసీదుకు వెళ్లి ప్రార్థన చేయడంతో అతని దినచర్య ప్రారంభమయ్యేది.

షహరాన్‌పూర్ ప్రాంతం మత కలహాలకు పెట్టింది పేరుగా ఉండేది. హిందూ ముస్లిం గొడవలతోబాటు ముస్లింలలో ఉన్న రెండుమూడు వర్గాల మధ్య గొడవలు తరచూ జరుగుతుండేవి.

"గొడవల్లో ఎప్పుడూ తలదూర్చకు. ఎవరైనా గొడవలు పడుతుంటే వారి మధ్య సామరస్యం కుదుర్చు. ఈ ప్రపంచంలో ఎవరికి ఎవరూ శత్రువులు కాదు. ఇద్దరి మధ్య అంతరం ఎక్కువగా ఉంటే అపోహ కలుగుతుంది. విరోధులు అయిన ఇద్దరు వ్యక్తులు కలిసినట్లయితే అంతవరకూ వారి మధ్య ఉన్న విభేదాలు సగానికి సగం మటుమాయం అవుతాయి" ఫరీద్ తండ్రి హుస్సేన్ చెప్పే ఈ మాటలు అతని హృదయంలో తీవ్రంగా నాటుకుపోయాయి.

ఈ విధానంలో ఎప్పుడూ కృషి కొనసాగించేవాడు.

గ్రామంలో అందరి మనిషిగా అందరి తలలో నాలుకలా మత సామరస్యం, వర్గాల మధ్య స్నేహ వాతావరణం కల్పించడానికి కృషి చేసేవాడు. వివిధ మతాలకు చెందిన యువకులకు వివిధ రకాల పోటీలు నిర్వహించడం ద్వారా వారి మధ్య సత్సంబంధాలు పెంపొందించేవాడు.

జుమా మసీద్‌ను ఆ గ్రామంలో ముస్లింలు అందరూ ఎంతో పవిత్రంగా చూసుకునేవారు. శుక్రవారం వచ్చిందంటే ఎన్ని పనులున్నా ప్రార్థన చేయడానికి అందరూ వచ్చేవారు. ఇందుకోసం ఫరీద్ ఎంతో కృషి చేసేవాడు.

ఆ కృషికి గుర్తింపుగా 35 సంవత్సరాల చిన్న వయసులోనే జుమా మసీదు మేనేజర్‌గా అతనికి ఉద్యోగం లభించింది. ఉద్యోగం అంటే ఉద్యోగం కాదు. ఒక బాధ్యత. ఈ బాధ్యత స్వీకరించగానే ముస్లింల మధ్య ఐక్యత కోసం తన కృషిని ప్రారంభించాడు. మసీదు కేంద్రంగా ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టేవాడు.

మత సామరస్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఫరీద్ చేస్తున్న కృషి షహరాన్‌పూర్ పట్టణ ప్రజలందరూ గుర్తించారు. ఫరీద్ చేసే ఏ కార్యక్రమానికైనా విశేషసంఖ్యలో గ్రామస్తులందరూ హాజరయ్యేవారు.

ఫరీద్ చేస్తున్న కృషిని ఆ గ్రామానికి చెందిన మెజిస్ట్రేట్ దీపక్ తివారి ముందు గుర్తించాడు. మత సామరస్యం కోసం ఫరీద్ చేసే ప్రతి ప్రయత్నానికీ దీపక్ అండదండలు అందించేవారు. ప్రతి సంవత్సరం దసరా నవరాత్రి ఉత్సవాలు ఆ ప్రాంతంలో హిందువులు ఎంతో అట్టహాసంగా చేస్తుంటారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని దేవీ విగ్రహాలను మసీదు పక్కనుంచే ఊరేగించేవారు. ఇలా ఊరేగింపు జరిగిన ప్రతిసారీ ఆ ప్రాంతంలో ముస్లింలు రెచ్చిపోయేవారు. గొడవలకు దిగేవారు. ఫలితంగా మత కలహాలు చెలరేగేవి. ప్రతి ఏడాది దేవీ నవరాత్రుల సందర్భంగా జరిగే గొడవల్లో కనీసం పదిమంది అయినా గాయపడేవారు. ఈ దుస్థితిని నివారించడానికి ఎంతమంది ప్రయత్నించినప్పటికీ ఫలితం కనిపించలేదు.

ఈ సమయంలో ఫరీద్ రంగప్రవేశం చేశాడు.

గొడవలకు కారణమైన హిందూ ముస్లిం వర్గాలను సమావేశపరిచి వారి అభిప్రాయాలను తెలుసుకున్నాడు. ఎవరి మతం గొప్పతనం వారిదేనని చెప్పారు. ఇతర మతస్తులను గౌరవించిన నాడే మన మతం గొప్పతనం తెలుస్తుందని వివరించారు.

ఇరువర్గాలకు చెందిన వారి నుంచి గొడవలు పడం అని ప్రమాణాలు చేయించాడు. ఒకరి పండుగలకు మరొకరు సహకరించుకునేలా వారి మధ్య సామరస్యాన్ని కుదిర్చాడు. ఈ సమావేశానికి మెజిస్ట్రేట్ దీపక్ తివారీ కూడా హాజరయ్యారు. దీంతో ఎంతో ప్రాధాన్యత ఏర్పడింది. హిందూ ముస్లిం భాయి భాయి అయిపోయారు.

1998 సంవత్సరం వరకు మతకల్లోలాలు ఘర్షణలకు నిలయంగా ఉండే షహరాన్‌పూర్ పట్టణంలో ఒకలాంటి ప్రశాంతమైన వాతావరణం ఏర్పడింది. దానికంతటికీ మూలకారణం ఫరీద్ మాత్రమేనని ఆ గ్రామస్తులంతా నమ్ముతారు.

❁ ❁ ❁

సాయంత్రం ఆరు గంటలైంది.

ఎండాకాలం కావడంతో సూర్యకిరణాలు ఏటవాలుగా జుమా మసీదుపై ప్రతి ఫలిస్తున్నాయి.

మసీదులో ఉదయం పూజలు అయిపోయాయి.

ఫరీదు వరండాలో కూర్చున్నాడు.

అతని పక్కన వాల్మీకి కూర్చున్నాడు.

ఇద్దరూ ప్రాణస్నేహితులుగా ఉన్నారు. హిందువు అయిన తాను ముస్లింల ఉన్మాదం నుంచి బైటపడినప్పటి నుంచి ఫరీద్‌కు మంచి స్నేహితుడు అయిపోయాడు.

వాల్మీకి ఆ ప్రాంతంలోనే చిన్న పాఠశాల నడుపుతున్నాడు.

ఎప్పుడూ ఖాళీ దొరికినా జుమా మసీదుకు వస్తుంటాడు. అక్కడ మేనేజరుగా ఉన్న ఫరీద్‌ను కలుసుకుంటాడు. వారిద్దరు ఎన్నో సంగతులు చెప్పుకుంటారు. ఒకరి గురించి మరొకరు విషయాలను అడిగి తెలుసుకుంటారు.

వారిద్దరూ మాటల్లో ఉండగానే పోస్టుమేన్ వచ్చి కవరును అందించి వెళిపోయాడు.

చింపి గబగబా చదివాడు ఫరీద్.

తర్వాత వాల్మీకికి అందించాడు.

కేంద్ర ప్రభుత్వంలో హోంశాఖ ప్రతి సంవత్సరం ఏదో రంగంలో విశేషంగా కృషిచేసిన వ్యక్తికి 'కబీర్ సయ్యద్' పురస్కారాన్ని ఇస్తుంది. మత సామరస్యానికి కృషి చేసినందుకు ఆ ఏడాదికి ఫరీద్‌ను ఎంపిక చేశారు. అందుకు సంబంధించిన ఉత్తరం అది.

అది చదివిన తర్వాత వాల్మీకి ఎంతో పొంగిపోయాడు.

ఆ అవార్డు తనకే లభించినంత ఆనందపడిపోయాడు.

అభినందనలతో ముంచెత్తాడు.

ఆ నెలలోనే ఢిల్లీలో అవార్డు అందుకున్నాడు. అవార్డుతోబాటు పాతికవేల నగదు బహుమతి లభించింది.

నెలరోజుల తర్వాత వాల్మీకి నిర్వహిస్తున్న పేద పిల్లల పాఠశాలకు ఫరీద్ వెళ్లాడు. మిత్రుడ్ని సాదరంగా ఆహ్వానించాడు.

"ఈ పాఠశాల ఎంతోమంది పిల్లలకు దేవాలయంలా ఉంది. హిందూ ముస్లిం పిల్లలు కలిసి చదువుకుంటున్నారు. ఈ పిల్లలకు ఉపయోగపడేలా ఈ నగదు బహూకరిస్తున్నాను. హిందువులు, ముస్లింలు సోదరుల్లా మెలిగేలా విద్య బోధించాలి. అందుకోసం ఈ సొమ్ము వినియోగించాలి!" అంటూ పాతికవేల బహుమతి సొమ్మును వాల్మీకి చేతిలో పెట్టాడు.

ఫరీద్‌లో మానవత్వం వాల్మీకిని కదిలించింది.

ఆనందమో విషాదమో తెలియని వెచ్చని బాష్పాలు కళ్ళ నుంచి జాలువారాయి. ❖

నాడూ... నేడూ...

పి. జ్యోతి

నేనూ

మా వారూ బస్‌స్టాఫ్‌లో సిటీబస్ కోసం వెయిట్ చేస్తున్నాం. బస్ ఎంతకీ రావడంలేదు. చాలా విసుగ్గా ఉంది నాకు. చాలా షాపింగ్ ఉంది. టూ వీలర్ మీద వెళ్లాలంటే ఈ హెవీ ట్రాఫిక్‌లో అస్తమానం పార్కింగ్ చేస్తూ షాపింగ్ చేయడం ఎంత రిస్కో మనకు తెలియందికాదు కదా... పోనీ ఆటోల్లో తిరుగుదామంటే చేసే షాపింగ్ ఖర్చుకన్నా ఆటో బిల్లే తడిసిమోపెడవుతుంది మరి. అందుకే చివరగా బస్‌లో వెళ్లాలని నిర్ణయించుకుని ఇదిగో ఇలా బయలుదేరాం. అరగంట నుంచీ నిలుచున్నాం, ఓ తిక్క వెధవ... పాతికేళ్ళుంటాయోమో వాడికి. నేనెలా కనపడు తున్నానో మరివాడి కళ్ళకి తెలీదుకానీ, వెకిలిచూపులు చూస్తున్నాడు నాకేసి, పోనీలే అని ఊరుకున్నా. కానీ ఆ వెధవ చూపులు ఇంకాస్త అసహ్యంగా మారాయి. ఇహ నాకు అరికాలిమంట నెత్తినెక్కింది. అందుకని ఈయనగారితో...

"ఏవండీ! అటు చూడండి. ఆ జులపాలవాడు చాలాసేపటినుండీ నన్నే తినేసేలా చూస్తున్నాడు. వాడి సంగతి చూడండి" అన్నా

"అబ్బా! మీ ఆడవాళ్ళకి బయటికి వస్తే చాలు అన్నీ అనుమానాలేనే. అసలాడి చూపు చూడు. వాడొక వైపు చూస్తే మరోవైపు చూస్తున్నట్టుగా ఉంది. నీ మానాన నువ్వుండు సుధా" అన్నాడు కాస్త కోపంగా.

"అంటే, ఆ తింగరాడి చూపులుకూడా తెలుసుకోలేని దద్దమ్మలా కనపడుతున్నానా నేను మీకు" అన్నా ఆవేశంగా

"అసలు నీకెన్ని సార్లు చెప్పా. ఈ చుడీదారీన్ వద్దంటే వేసుకుంటావ్. వీటిని వేసుకుంటే నువ్వు తర్టీస్‌లోకొచ్చినా, సిటీక్స్‌న్స్‌లా కనపడుతున్నావ్. అలా కనపడాలని నీ కోరిక, నీ పక్కన నేనో అంకుల్‌లా కనపడుతున్నా. నీకు పెళ్ళికూడా కానట్టు నువ్వు అఘోరిస్తున్నావ్" గట్టిగా అరిచారు నామీద.

"అంటే నేను ముప్పయ్యేళ్ళొచ్చి, మూడేళ్ళుదాటి, మూడునెలలు కూడా కాకుండగానే మూడుకాళ్ళ ముసలమ్మలా మూలకూర్చోవాలనా? ఈ ఫాస్ట్ యుగంలో మనం ఎన్నో మార్పులను సంతోషంగా స్వీకరిస్తున్నాం. అవునా కాదా, ఇంతెందుకూ మా ఆడవాళ్ళ విషయంలో పూర్వపు రోజులకీ ఇప్పటికీ వచ్చిన మార్పులను కొన్నింటిని చూడండి, మీకు చెబుతాను"... అప్పుడు గుర్తొచ్చింది. ఆయనకు. నాకు మూడొచ్చిందంటే వరసబెట్టి క్లాసు పీకుతానని... కానీ ఏం చేస్తాం... అప్పటికే మొదలైపోయింది. కాబట్టి... తప్పదు అని నేను క్లాసు పీకడానికి, ఆయన వినడానికీ రెడీ...

"నెంబర్ వన్: వెనకటి రోజులలో వంట కట్టెలపొయ్యి మీద ఓ గొట్టంతో ఉఫ్‌ఉఫ్ మని ఊదుకుంటూ కళ్ళ నీళ్ళు కారగా వండుకుని తినేవాళ్ళు. నేడు చక్కగా గ్యాస్ పొయ్యిమీదో, ఇంకా లేటెస్ట్‌గా రైస్ కుక్కర్‌లోనో వండుకుని తింటున్నాం. ఈ మార్పును ఎవరైనా తప్పుగా అనుకుంటున్నారా? కాలానికి అనుగుణంగా మారక ఇప్పడుకూడా ఆ గొట్టం వంటే చేస్తూ ఉంటే ఆడవాళ్ళం దానికే అంకితం అయ్యి వేరే పనులేం చేయలేరు. కాబట్టి మనం మారే తీరాలి"

"నెంబర్ టూ: పూర్వం రుబ్బురోలులో వేసి ప్రతీదీ రుబ్బుకుని తీనేవాళ్ళు. మరిప్పుడు రకరకాల మిక్సీలు, గ్రైండర్స్ వచ్చాయి. వాటిల్లో వేసుకుని చేసుకుంటున్నామా లేదా? ఇంకా రుబ్బుకుంటూనే ఉంటాం అంటే అలా రుబ్బుకుంటూ ఇంట్లోనే ఉండాలి. ఇక వేరే ఉద్యోగం సద్యోగం చేయకుండా, అలా వీలవుతుందా ఇప్పుడు. మరీ మార్పును మనం సంతోషంగా అంగీకరించామా లేదా."

"నెంబర్ త్రీ: బట్టలు బండకేసి బాది బాది చేతులరిగేలా ఉతికేవాళ్ళు. మరిప్పుడు రకరకాల వాషింగ్‌మిషన్స్‌లో వేసి ఇలా నిమిషాల్లో శుభ్రం చేసుకుంటున్నాం, మరిప్పుడూ బట్టలు బాదుకుంటూనే ఉంటాం అంటే టైమంతా అక్కడే సరిపోతుంది.



బయటికెళ్ళి మేం పనులేం చేస్తాం? మరీ మార్పును మనం సంతోషంగా తీసుకోలేదా?"

"నెంబర్ ఫోర్: పూర్వం ఆడవాళ్ళు ఇంట్లోనే నడుములు విరిగేలా చేతులరిగేలా చెక్కలు, జంతికలు, అరిశెలు, చక్కిలాలు, లడ్డూలు, మైసూర్‌పాక్‌లు, కోవాలు, ఇలా రకరకాల ఐటమ్స్ ఇంట్లోనే తయారు చేసుకునేవాళ్ళు. మరిప్పుడు, హోమ్‌ఫుడ్స్‌లోనూ, స్వీట్‌షాప్‌ల్లోనూ, ఇంకా... బేకరీల్లోనూ ఫఫ్‌లూ, బర్గర్‌లూ, పిజ్జాలూ, అలా వెళ్ళి అవలీలగా క్యారీ బాగుల్లో రకరకాలుగా మోసుకుని తెచ్చుకుని తింటున్నాం మరీ మార్పును మనం అందరం ఆమోదిస్తున్నామా లేదా?"

"నెంబర్ ఫైవ్: వెనుకటి రోజుల్లో ఆడవాళ్ళు ఇంట్లోనే వంటావార్పూ చేస్తూ కూర్చుంటే సరిపోయేది. మరిప్పుడు మగవాళ్ళతో సమంగానే కాదు ఇంకా ఎక్కువే ముందడుగువేసి మేమే ఫస్ట్ అనిపించుకుంటున్నామా మరి, దీనిని కూడా అంగీకరిస్తున్నామా మనం. ఇన్నింటిలో మార్పు రాగా లేనిది మా ఆడవాళ్ళం చీరల్లోనుండీ చుడీదారీస్‌ల్లోకి రావడం తప్పా! ఈ మార్పు చూడటానికి అంత అసభ్యకరంగానైతే లేదు కదా, ఒంటినిండుగా చక్కగా పొందికగానే ఉందికదా, ఈ హడావిడి పరుగుల జీవితానికి, ఉద్యోగినులకైనా సరే కాలేజీలకు వెళ్లే అమ్మాయిలకైనా సరే, వెహికల్స్‌మీద తిరగడానికైనా సరే, ఎంతో కన్వినెంట్‌గా ఉంటుంది కదా. ఇవి నచ్చినవాళ్ళే వేసుకుంటారు. నచ్చని వాళ్ళు చీరల్లోనే ఉంటారు. అంతే కానీ వేసుకున్నంత మాత్రాన, నువ్వు చిన్న పిల్లలా కనపడటానికి వేసుకున్నావని ఏవీ దెప్పిపొడవక్కర్లేదు. మీ బాధ నాకర్థవయిందిలేండి. మీ మగాళ్ళకి చిన్న పిల్లల్లా కనపడటానికి ఈ ఫ్యాంటూ షర్ట్ తవ్వ వేరే డ్రెస్‌లేదని మీ ఏడుపు. మీక్కూడా ఇలాంటి అవకాశం ఉండి ఉంటే మాకన్నా ఎక్కువే దిక్కుమాలిన వేషాలు వేసేవారు."

నేనంతా చెప్పడం పూర్తి చేసాననుకోని ఒకసారి చుట్టూచూసా. అసలు స్టాఫ్‌లో ఎవ్వరూలేరు. ఈయన కూడా ఎక్కడా కనబడలేదు, బాగా చీకటిపడి లైట్లుకూడా వెలుగుతున్నాయ్. ఏమైై ఉంటారబ్బా అనీ చూస్తూ ఉండగా, దూరం నుండీ మోయలేనన్నీ క్యారీబ్యాగులు మోసుకుంటూ వస్తున్నారు. అవన్నీ ఏవైఉంటాయబ్బా అనుకుంటూ ఉండగానే అన్నీ తెచ్చి నాకందించారు.

"ఏవిటండీ ఇవన్నీ" అన్నా ఆశ్చర్యంగా. తెరిచి చూసా... అన్నీ చుడీదారీ డ్రెస్సెస్, నా ఆశ్చర్యాన్ని చూసి ఆయనగారు

"నువ్వు ఈ డ్రెస్సెస్ గురించి క్లాస్ మొదలెట్టగానే నాకర్థవయింది. నీకీ డ్రస్సులే కావాలని. అందుకే అప్పుడెళ్ళి ఇప్పుడొచ్చా. ఇహ ఇక్కడ వేరే షాపింగ్‌లేవీ కుదరదు. మన సరుకులకని షాపింగ్‌కని తెచ్చిన డబ్బంతా ఇదిగో వీటికే సరిపోయింది. పద ఇంటికెళ్దాం" అన్నారు.

"ఏవిటీ! అంత డబ్బు నా కోసం ఖర్చుచేసారా? అబ్బనేనంటే ఎంత ప్రేమ మీకు, మీరెంత మంచివారండి" అన్నా హాయిగా నవ్వుతూ...పప్పులూ, ఉప్పులూ, నూనెలు తదితర సరుకులకు ఆ నెల డబ్బులు మిగలేదనుకోండి. అదప్పటికి గుర్తుకురాని సీను.

❖

"అంగళ్ళ బతుకాయెరన్నా...!"

రుక్మిణి

"ఏందిరా గా లొల్లి... జెండాలు, బ్యానర్లు తగిలిచ్చుకుని వూరేగింపులు చేస్తండ్రు... మళ్ళా ఏమొచ్చింది" జక్కులోడు మల్లేశాన్ని అడిగిండు.

"ప్రైవేటు మార్కెట్లు వద్దని గోలకు తగులుకున్నరు" తాపీగా చెప్పి మల్లేశం బీడీ వెలిగిచ్చుకున్నడు. జక్కులోడికి సమజ్ కాలేదు. అంతా తికమకగా వుంది. ఈ మల్లేశంగాడెపుడూ గింతే... ఏదైనా పుసుక్కున అడిగితే, వాడుగాని చెప్పింది విన్నరంటే మరో పది అనుమానాలు వచ్చి పడ్తయి... గింతే దమాక్ తక్వ యవ్వారం!

"అరె నీయవ్వ... మార్కెటంటే ఏందిర? సరుకులమ్ముకునేది. మార్కెట్లో అమ్ముకునేటోడు... కొనుక్కునేటోడు కాక ఎవ్వరుంటారు మరి కొనేటోడు ప్రైవేటోడుగాక గెజిటెడాఫీసరా? నీ కసలు బుర్రున్నా గది పనిచేయదురా.

లొడలొడ వాగుతున్న జక్కులోడివంక మల్లేశం చాలా జాలిగా చూసిండు. వాడు అంతా వాగి ఆగినంక నిమ్మళంగ తగులుకున్నడు.

"ఒరె జక్కులోడా... నీకు పండిన వడ్లు నువు యాడమ్ముకుంటవేర?"

"గీడనే మార్కెట్ల...!"

"ఎవరికి?"

"ఎవడుకొంటే వాడికి!" జక్కులోడు దురుసుగా జవాబు చెప్పిండు.

"సరెరా... గా మార్కెటుయార్డు ఎవర్ది"

"గవర్మెంటుది!"

"కద... దానికో కార్యదర్శి, క్లర్కులు, ఛైర్మన్- కొన్ని చట్టాలు, రూల్సు వుంటాయిగద. నువు మిర్చి, కందులు, పెసలు అన్ని రకాలవి తీస్కపోయి కందుల కొనేటోల్లకు అమ్ముకుంటవు. వాళ్ళు నీకు చిట్టిలిస్తరు. అటెంక డబ్బులిస్తరు. గంతేగద!"

"ఎట్లయితేంది... ఎవడో ఒకడు... పైసలయితే ముడ్తయి" జక్కులోడు నిమ్మళంగ అన్నడు.

"ఒరే కొన్ని పల్లెటూర్లలో ఇప్పటికీ సంతలు వారం వారం జరుగుతయ్. వాటిని అక్కడి గ్రామస్తులందరు కలిసి ఓ కమిటి వేసుకుని నడుపుకుంటరు. గిట్లాంటి సంతల మీద వచ్చే రాబడిని బడికో, గుడికో, వూరిమీదనో ఖర్చుపెడతరు"

"తెలుసులేరా!" జక్కులోడు చికాకు పడ్డాడు.

"మరి గా సంతల్లో పల్లెజనం వారానికి ఒకసారి పోయి కావాల్సిన సరుకులు కొనుక్కుంటారు. కొందరు అమ్ముకుంటరు. గాడ అన్ని రకాల దినుసులు, సరుకులు దొరుకుతాయి!

"అయితే"

"గిపుడు గీ ప్రైవేటు వాండ్లు పెట్టే సంతల్లో నువు, అక్కడ ఏ పంట అమ్మాల్నంటే గా ఒక్క సరుకే అమ్మాల. శనక్కాయల మార్కెటంటే ఒక్క శనక్కాయలే అమ్ముకోవాలె. వడ్లు అమ్ముకోవాల్నంటే నాలుగైదు పూర్లవతల వున్న మార్కెట్లో అమ్ముకోవాలె.

జక్కులోడు బిత్తరపోయిచూశాడు.

"గదేం మార్కెట్లు... గదేం మతలబు..." అని గొనిగిండు.

"గదా... అది మన ప్రపంచ బ్యాంకు దెబ్బల్లో అదోటి – నువుగాని అయిదారు రకాలు పండిచ్చిన పంటలు వేస్కుని వాటినిగిన అమ్ముకోవాల్నంటే 'అలో లక్ష్మణా' అని గా మూటలు నువ్వు నీ పెండ్లం నెత్తిన పెట్టుకొని, సద్దిమూటలు సంకన పెట్టుకుని ఇంగ మార్కెట్ల ఎంట పడాల్నన్న మాట...

"వామ్మో... వామ్మో...!" జక్కులోడు గుండెలు బాదుకున్నడు.

"నీ వు పండిచ్చిన సరుకుల్ని నువ్వు నీ పెండ్లాం కలిసి అమ్ము కోడానికి ఒకవారం రోజులు పడ్తయి. తిరగాలెగద... పాతిక కిలోల కందులమ్ముకోడానికి పాతిక కిలోమీటర్లు పోవాలె. యాభైకిలోల పెసలమ్ముకోడానికి యాభైమైళ్ళ దూరాన పెసలు మార్కెటుంటే గాడికిపోయి అమ్ముకోవాలె...

మల్లేశం చెప్పుకపోతనే వుండు. జక్కులోడు శివాలెత్తిపోయి పూనకం వచ్చినవాడిలా ఎగురుతూ "కుదర్దు కుదర్దంటే కుదరదని" భారీ రంకెలు వేస్తుండు.

మల్లేశం జాలిగా చూసి చెప్పుడు ఆపిండు.

"సరేగాని జక్కులోడా... కథ యింతటితో అయిపోలేదురా..."

"ఇంకా వుందా" అరె... ఆదేందే... వారంరోజులు మార్కెట్ల చుట్టు తిరిగినంక మళ్ళీ కదేంది చెప్పు" ఆత్రంగా అడిగిండు.

"అయిదారు మార్కెట్లల నీ సరుకులు కొన్నవాండ్లు అపుడే నీకు పైసలు ఇయ్యరు. ఒక్కొక్కడు ఒక్కొక్క వాయిదా పెడ్తడు. నువ్వు అమ్మడానికి పెండ్లాన్నేసుకుని వరసగా అన్ని రకాల మార్కెట్లు తిరిగి అమ్ముకున్నరా... మరి గిపుడు ఒక్కో మార్కెట్టుకు ఒక్కో రోజు చొప్పున ఈ పదిహేను రోజులు తిరిగితేగాని నీ పైసలు నీకు వసూలు గావు!"

ఎగరటం ఆపి జక్కులోడు చప్టామీద కూలబడ్డడు.

"ఇంకా కథ అయిపోలేదు" మల్లేశం నవ్వుతూ అన్నడు. "ఇంకా సచ్చిందా?" జక్కులోడు మూలిగిండు.

"కొన్ని మార్కెట్లలో నీ సరుకులు కొన్నోడు నీకు కనిపిచ్చకపోవచ్చు... కనపడ్డాక మళ్ళీ వాయిదా పెట్టొచ్చు. నువ్వూ నీ పెండ్లాం బస్సులో పదిపదిసార్లు తిరిగి రావాల్సిరావచ్చు... ఏతావాతా వాడు ఎగ్గొట్టి జెండా ఎత్తేయవచ్చు... గ్యారెంటీ లేదు. మీ బతుకులో చాలాకాలం అంగళ్ళ పొంటనే తిరుగుడయితది...

ఇంకేం... జక్కులోడు గ్యారంటీగా మూర్ఛపోయాడు.

❖





రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ప్రతి సంవత్సరం అతిసార వ్యాధి కనిపిస్తున్నది. ముఖ్యంగా మే, జూన్ నెలలలో ఎక్కువగా ప్రబలుతోంది. మనకు ఈ వ్యాధి కొత్తేమీ కాదు. సుమారు ఏడున్నర కోట్ల జనాభా గల ఈ రాష్ట్రంలో ఎన్ని ముందు జాగ్రత్త చర్యలు, ప్రజలను చైతన్యపరచే కార్యక్రమాలు చేపట్టినా ప్రజల్లో శాస్త్రీయ అవగాహన రాహిత్యం, వ్యాధి వ్యాప్తిచెందే వరకు పట్టించుకోని నిర్లక్ష్యధోరణి, కొందరు అధికారులు సకాలంలో స్పందించక పోవడం వంటి కారణాల వల్ల అతిసార వ్యాధి అదుపు తప్పుతూనే ఉంది. ఈ పరిస్థితులలో అతిసార వ్యాధిపై శాస్త్రీయ అవగాహన కల్పించడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

అతిసార వ్యాధి

అతిసార ఎలా వ్యాప్తి చెందుతుంది?

అతిసార వ్యాధినే "గ్యాస్ట్రో ఎంటరైటిస్" (జి.ఇ) అంటారు. మానవ శరీరంలోని జీర్ణవ్యవస్థ (గ్యాస్ట్రో ఇంటెస్టయినల్ ట్రాక్ట్-జి.ఐ.టి.)కు సోకే వ్యాధి ఇది. ఈ వ్యాధి సోకినపుడు జీర్ణవ్యవస్థ పనితీరు అస్తవ్యస్థమై అసాధారణ విరోచనాలు, వాంతులకు గురికావడం జరుగుతుంది. దీనినే "అతిసార వ్యాధి"గా పేర్కొంటారు.

అతిసార వ్యాధికి వివిధ రకాల బ్యాక్టీరియా, వైరస్‌లు కారణమవుతున్నాయని వైద్య పరీక్షలలో వెల్లడవుతున్నది. వీటిలో 'ఇ-కోలై' అనే బ్యాక్టీరియా కీలక పాత్ర వహిస్తోంది. అతిసార కారక సూక్ష్మజీవులు ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందడంలో త్రాగునీరు ప్రధానపాత్ర వహిస్తుంది. అడుగంటిన బావుల్లోని నీరు, కొద్దిగా పారుతున్న కాలువలు, వాగులలోని నీటిని శుభ్రపరచకుండా తాగడం వల్లే అతిసార వ్యాధి సంక్రమిస్తోంది. ఈ నీటిలో అతిసార వ్యాధి కారక సూక్ష్మజీవులు చాలా ఎక్కువ కాన్‌సెంట్రేషన్‌లో ఉండడమే అందుకు కారణం. మల మూత్రాలపై, చెత్తాచెదారంపై వాలిన ఈగలు, ఇతర ఇన్‌సెక్ట్స్ ఆహార పదార్థాలపై వాలడం వల్ల, అవి సూక్ష్మజీవులతో కలుషితమయి వ్యాధి వ్యాప్తికి కారణమవుతున్నాయి. తాగునీటి సరఫరా గల ప్రాంతాలలో పైపుల లీకేజి వల్ల మంచినీరు కలుషితమై అతిసార వ్యాధి విజృంభిస్తోంది.

లక్షణాలు

వ్యాధి కారక సూక్ష్మ జీవులు ఇంతకు ముందే చెప్పినట్టుగా జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతాయి. గ్యాస్ట్రో ఇంటెస్టైనల్ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్‌కు, ఇన్‌ఫ్లమేషన్‌కు గురి అవుతుంది. ఫలితంగా జీర్ణవ్యవస్థ పనితీరులో అసాధారణతలు మొదలై వాంతులు, విరేచనాలు ప్రారంభమవుతాయి. దీనివల్ల విపరీతమైన దాహం వేస్తుంది. గొంతు నాలుక ఎండిపోతాయి. కళ్ళు గుంటలు పడతాయి. చర్మంలోని నీరు ఇంకిపోయి, ముడతలు పడుతుంది. పాలిపోయినట్లు కన్పిస్తుంది. సాధారణ సాగేశక్తి (ఎలాసిటి)ని కోల్పోతుంది. శరీర ద్రవాలలో ఎలక్ట్రోలైట్ ఇంబాలెన్స్ వస్తుంది. కోల్పోయిన నీటి శాతాన్ని పూరించకపోతే వ్యాధిగ్రస్తులు నీరసించిపోతారు. నిర్లక్ష్యం చేస్తే మరణం సంభవిస్తుంది. అతిసార వ్యాధికి గురవుతున్న వారిలో ఎక్కువగా పిల్లలు, వృద్ధులు ఉంటున్నారు. వీరిలో వ్యాధి నిరోధక శక్తి సహజంగా తక్కువగా ఉండడమే అందుకు కారణం అయి ఉండవచ్చును. వీరి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం మంచిది.

వ్యాధికి చికిత్స

అతిసార వ్యాధి పూర్తిగా నిరోధించగలిగిన వ్యాధి. ఎక్కడైనా చికిత్స చేయవచ్చును. సంపూర్ణ చికిత్స ఉంది. నిజానికి ఈ వ్యాధికి వాడాల్సిన ప్రత్యేకమైన మందులు ఏమిలేవు. సాధారణ యాంటిబయాటిక్స్, యాంటి డయేరియల్స్, ఓరల్ ఫ్లూయిడ్స్, అవసరమైతే ఐ.వి (ఇంట్రావీనస్) ఫ్లూయిడ్స్ ద్వారా వ్యాధిని పూర్తిగా అదుపులో పెట్టవచ్చును.



మరణాలకు కారణం

వ్యాధిగ్రస్తుల నిర్లక్ష్యమే చాలా సందర్భాలలో అతిసార మరణాలకు కారణ మవుతుంది. వ్యాధి లక్షణాలైన వాంతులు, విరేచనాలు ప్రారంభమయిన వెంటనే చికిత్స ప్రారంభించాలి. చికిత్స ఇంటిలోనే మొదలు పెట్ట వచ్చును. అయినా చాలా మంది బాధితులు ప్రారంభించడం లేదు. అదే తగ్గుతుందని వ్యాధిని నిర్లక్ష్యం చేస్తున్నారు. వ్యాధి అదుపు తప్పుతున్న స్థితిలో కొందరు నకిలీ వైద్యుల్ని ఆశ్రయిస్తున్నారు. వారి అరకొర వైద్య పరిజ్ఞానపు చికిత్స కొన్ని సందర్భాలలో ప్రాణాంతకమవుతున్నది. కొందరు క్వాలిఫైడ్ వైద్యుల్ని సంప్రదించినా, వ్యాధి కాస్త తగ్గుముఖం పట్టగానే చికిత్స మానేస్తున్నారు. మరి కొందరు మూఢ నమ్మకాలతో, అపోహలతో వైద్యానికి ముందుకు రావడంలేదు. మొక్కుబడులకు ప్రాధాన్యత ఇచ్చి, ప్రాణాలకే ముప్పుతెచ్చు కుంటున్నారు. అతిసార వ్యాధిగ్రస్తులు బాగా నీరసించిపోయి, ప్రాణాపాయ స్థితిలో చికిత్స వైద్యుని చేయి దాటిన పరిస్థితులలో రోగుల్ని ఆసుపత్రుల్లో చేర్చడం జరుగుతోంది. అప్పటికే ఈ రోగులు కొన ఊపిరితో ఉండడమో, మరణించడమో జరుగుతున్నది. మూత్రపిండాలు

పూర్తిగా చెడిపోయి (రీనల్ ఫెయిల్యూర్) కొన ఊపిరితో ఉన్న రోగులకు ఎంత ఖర్చుపెట్టి, ఆధునిక వైద్యసదుపాయాలు కల్పించినా ఫలితం దక్కడం లేదు. మరణాలు తప్పడం లేదు. అతిసార వ్యాధికి. గురైనవారు నిర్లక్ష్యం చేయకుండా ముందుకు వచ్చి ఆరోగ్య కార్యకర్తలు, వైద్యుల సలహాలు పొందితే మరణాలను పూర్తిగా నిరోధించవచ్చును.

ఓ.ఆర్.టి. ప్రాధాన్యత

ఓ.ఆర్.టి. అంటే ఓరల్ రీ హైడ్రేషన్ థెరఫి. శరీరం వాంతులు, విరోచనాల ద్వారా కోల్పోయిన నీటి శాతాన్ని, ఎలక్ట్రోలైట్స్‌ను నోటి ద్వారా ద్రవరూపంలో ఇవ్వడం ద్వారా చేసే ప్రాథమిక చికిత్సా విధానం ఇది. అతిసార వ్యాధికి గురైన వారిలో వాంతులు, విరోచనాల ద్వారా శరీరంలోని నీటి శాతంతో పాటు, సోడియం, పొటాషియం బై కార్బొనేట్, క్లోరైడ్ వంటి ఎలక్ట్రోలైట్స్‌ను కూడా కోల్పోవడం జరుగుతుంది. ఇవి దేహ జీవనానికి ఎంతో అవసరం. మనం తాగేనీటిలో అతి తక్కువ పరిమాణంలో ఈ ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. అతిసారకు గురైన వారిలో కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్ లోపాన్ని సరిదిద్దడానికి అవి ఏమాత్రం సరిపోవు. అందువల్ల అదనంగా ఎలక్ట్రోలైట్స్ ఇవ్వాల్సి ఉంటుంది. ఎలక్ట్రోలైట్స్ లోపాన్ని, కోల్పోయిన నీటి శాతాన్ని నోటి ద్వారా సులభంగా ఇవ్వడం ద్వారా సరిదిద్దేందుకు రూపొందించిన ద్రవమే ఇది. ఓ.ఆర్.ఎస్. అంటే ఓరల్ రీ హైడ్రేషన్ సొల్యూషన్. ఈ ద్రవం ద్వారా చికిత్స చేయడాన్నే ఓ.ఆర్.టి. అంటారు. ఇది పొడి రూపంలో ప్యాకెట్‌లలో లభ్యమవుతుంది. పరిశుభ్రమైన నీటిని కలపడం ద్వారా ద్రవాన్ని తయారు చేసుకోవాలి. నీరు ఎంత కలపాలో ఎలా కలపాలో ఆ ప్యాకెట్‌పైనే ముద్రించి ఉంటుంది. ఓ.ఆర్.టి. ప్యాకెట్‌లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. దేశవ్యాప్తంగా ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలోను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోను ఇవి లభ్యమవుతాయి. సమయానికి రోగికి ఈ ప్యాకెట్‌లు అందుబాటులో లేకపోతే పరిశుభ్రమైన కాచి వడపోసిన నీటిలో చిటికెడు

ఉప్పు, కొద్దిగా పంచదార కలిపి ఇవ్వవచ్చును. ఇది కూడా ఓ.ఆర్.టి. వలెనే పనిచేస్తుంది.

నిరోధం - జాగ్రత్తలు

అతిసార నిరోధంలో వ్యక్తిగత జాగ్రత్తలు అత్యంత ప్రధానమైనవి. ఈ జాగ్రత్తలు పాటించడంలో మహిళలదే కీలకపాత్రగా పేర్కొనవచ్చును. మహిళలు అప్రమత్తంగా ఉంటే అతిసార వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చుననడంలో అతిశయోక్తి లేదు.

❖

దంత సంరక్షణ

క్విజ్-8

నిర్వహణ: డా॥ కె.ఎల్.వి. ప్రసాద్, హన్మకొండ

1. నిద్రలో పళ్ళు కొరకడాన్ని ఇలా పిలుస్తారు.
   అ) టీత్ గ్రైండింగ్
   ఆ) మాస్టికేషన్
   ఇ) బ్రూక్సిజం
   ఈ) అన్నీ కరెక్టే.
2. రెండు దవడలు కలుసుకున్నప్పుడు పై దవడ పళ్ళు క్రింది దవడ పళ్ళలో సరైన పద్ధతిలో ఒదిగిపోవడాన్ని ఇలా పిలుస్తారు.
   ఆ) టీత్ సెట్టింగ్
   ఆ) అక్లూజన్
   ఇ) టీత్ ఫిట్టింగ్
   ఈ) ఇరోజన్
3. రెండు దవడలు కలసినప్పుడు, పై దవడపళ్ళు క్రింది దవడ పళ్ళతో సరిగా ఒదిగి వుండక పోవడాన్ని ఇలా పిలుస్తారు.
   అ) మాల్-అక్లూజన్
   ఆ) నాన్-అక్లూజన్
   ఇ) ఫాల్స్-అక్లూజన్
   ఈ) రాంగ్-అక్లూజన్
4. ముందరి పళ్ళ మధ్య వ్యాధితో సంబంధం లేకుండా ఎడం (ఖాళీ) ఉండడాన్ని
   అ) గ్యాపింగ్ అంటారు
   ఆ) స్పేసింగ్ అంటారు.
   ఇ) డయాస్టిమా అంటారు
   ఈ) అన్నీ కరక్టే
5. దవడలో 'పన్ను' అమరి ఉండే భాగాన్ని
   అ) పంటి కుహరం అంటారు
   ఆ) పంటి గూడు అంటారు
   ఇ) పంటి కుదురు అంటారు
   ఈ) పంటినాళం అంటారు
6. ఎక్కువ శాతం పంటి వ్యాధులు రావడానికి కారణం
   అ) బాక్టీరియా
   ఆ) ఫంగస్
   ఇ) నోటి అపరిశుభ్రత
   ఈ) వైరస్
7. 'దంతధావనం'లో యిప్పటికీ వాడుకలో ఉన్నది
   అ) టూత్ పేస్ట్
   ఆ) టూత్ పౌడర్
   ఇ) బొగ్గు
   ఈ) పంటి పుల్ల
8. ఈ క్రింది వాటిలో పళ్ళు తోముకోవడానికి (దంతధావనం) వాడకూడనిది.
   అ) బొగ్గు
   ఆ) పంటి పుల్ల
   ఇ) పళ్ళపొడి
   ఈ) టూత్‌పేస్ట్
9. సాధారణంగా వాడవలసిన టూత్ బ్రష్ ఇలాంటిదయితే బావుంటుంది.
   అ) హార్డ్
   ఆ) మీడియం
   ఇ) సాఫ్ట్
   ఈ) సూపర్ సాఫ్ట్.
10. సాధారణంగా దంత వైద్యుల సలహా ప్రకారం పళ్ళుతోముకోవలసిన సమయం
   అ) 15ని॥లు
   ఆ) పది ని॥లు
   ఇ) 2 ని॥లు
   ఈ) 5 ని॥లు

జవాబులు:
1) ఇ 2) అ 3) అ 4) ఇ 5) ఇ
6) ఇ 7) ఈ 8) అ 9) ఇ 10) ఈ

పుస్తకపరిచయం



'జలగండం'
కవి. వై. శ్రీరాములు
వెల: రూ.30/- ,
పేజీలు: 50
ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలో లభించును.

'జలగండం'

చాలా రోజుల తర్వాత కొత్త చూపుతో, కొత్త అభివ్యక్తితో ఒక ప్రత్యేకతను సంతరించుకున్న కవిత వై. శ్రీరాములుగారి 'జలగండం'. నేడు ప్రకృతి సాధించిన భూమి, గాలి, నీరు కూడా వ్యాపారవస్తువులుగా మారాయని చెబుతూ కవి అనంతపురం నేపథ్యంగా చేసుకుని ఈ దీర్ఘ కవిత రాసారు. 2004 రంజని - కుందుర్తి తెలుగు సాహితీ సమితి అవార్డు స్వంతం చేసుకోగలిగారు శ్రీరాములు, గుక్కెడు నీళ్లకోసం అలమటించిపోతున్న రాయలసీమ దాహార్తులకోసం, వంటలకోసం చలించి రాసిన డాక్యుమెంటిది. నిజంగానే నిజం ఇది.

అనంతనీటి ఇక్కట్లను ఉటకిస్తూ ఈ పాదాల్లో కవి ఇలా ఆక్రోశిస్తాడు. *"ఇక్కడ బ్రతుకు నిరంతరం/ మండుతున్న అగ్నిగుండం/ఇక్కడ మనిషికి నిత్యం యమగండం/ఇక్కడ మట్టి జలగండం"*

లోగడ విద్యాన్ విశ్వం 'పెన్నేటిపాట' లో రాయలసీమ వ్యథల్ని వర్ణించారు. అవే కాకుండా నేడు కనిపిస్తున్న కుత్సిత రాజకీయాన్ని, గుండాయిజాన్ని, బాంబుల సంస్కృతినీ ఛాయా మాత్రంగా దృశ్యమానం చేస్తాడీ కవితలో, నగ్నముని దానికి పీఠిక వ్రాస్తూ కవిని వెన్నుతడితే, నాగసూరివేణుగోపాల్ జలగండానికి భరతవాక్యం పలుకుతూ ఇటువంటి మంచి కవిత్వం రావాలని స్వాగతించాడు.

నీరులేక పంటలు పండక పత్తిరైతులు చనిపోవడం వంటి దయనీయదృశ్యాన్ని ఈ కవి ఏకరువుపెట్టిన తీరు హృద్యంగా వుంది. వేరుశనగపంటకు కేంద్రం అనంతపురంజిల్లా. నీరులేకపోతే రైతు వ్యథ ఎలాగుంటుందో పాఠకుల కళ్లముందుకు తెస్తాడు శ్రీరాములు. అనంతలో నుండి వస్తున్న రాజకీయ నాయకుల్ని గురించి చెబుతూ ఇలాగంటాడీ కవి.

ప్రజలమధ్య ప్రజల సమస్యలు తెలుసుకొని ప్రజాసేవ చేస్తూ ప్రజలనుంచి వచ్చిన వాళ్లసంఖ్య చాల తక్కువ అంటాడు. వ్యవసాయం కోసం రుణాలు చేసి తీర్చలేక చనిపోయిన సూరిగాడు గురించి కవితాత్మకంగా చెప్పినది. తాను హృదయాల్ని కదిలించివేస్తుంది. నేడు మనం వున్నది ప్రజాస్వామ్య వ్యవస్థకాదురా రాచరికపు వ్యవస్థ అని వ్యవస్థ మీద నిప్పులు చెరుగుతాడీ కవి.

కవిత్వపరంగా పరిశీలించి నట్లైతే ఈ చిన్న పుస్తకంలో పదవినోదం, పదవిన్యాసం, బావగం భీరంగల కవితాపాదాలు అనేకం ఉన్నాయి. ఉదాహరణకు "కరువు తోరణం' అయింది ఇలా "కరువు/తో/రణం" అంటాడు. ఒక విధంగా చెప్పాలంటే నిజంవైపు హృదయాన్ని మేధస్సుని మేల్కొల్పుతున్నాడని చెప్పుకోవచ్చు. దీర్ఘకవిత రాసేటప్పుడు ఏకాగ్రత చెడుతుంది. కానీ ఈ కవి పట్టిన పట్టు విడువకుండా అనంత నేపథ్యం ఔపోసన పట్టినట్టు ఏక సూత్రతతో ఈ దీర్ఘ కవితకు ఊపిరి పోశాడు. దేశ అభివృద్ధి కోసం తెస్తున్న విదేశీ అప్పులలో కొద్ది శాతం వ్యవసాయానికి ఖర్చు చేయగలిగితే రైతుల ఆత్మహత్యలుండవు. ఆకలి చావులుండవు. అప్పులకోసం బ్యాంకులకు పరిగెట్టాల్సిన అవుసరం ఉండదని ఘోషిస్తాడు.

శ్రీరాములు చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా, సూక్ష్మంగా, సరళంగా చెప్పడంలో నేర్పరి అనిపిస్తుంది. ఈ కవి ఇలాగే మంచి కథాంశాల్ని గ్రహించి కథాకావ్యరచన చేస్తే మరింత రాణించగలరు.

- డా॥ మంతెన

స్వీకారం



అంకెల వింతలు
ఎస్.వి.ఆర్.సత్యనారాయణమూర్తి
వెల: రూ.30/- పేజీలు:69
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన భవన్, అబిడ్స్, హైదరాబాద్

జంధ్యా మారుతం
పులగం చిన్నారాయణ
వెల: రూ.60/- పేజీలు: 136
ప్రతులకు: 1000

హరి కార్టూన్లు

నవ్వడం గొప్ప విషయమే. నవ్వించడం అంత కన్నా గొప్ప విషయం. నవ్వించ డానికి, నవ్విస్తూ ఆలోచింప చేయడానికి ఎంతకష్టపడాలి అనే విషయం కార్టూనిస్టుకూ, కామెడీ ఆర్టిస్ట్ మాత్రమే తెలుస్తుంది. కార్టూనిస్టు జరుగుతున్న విషయాల గురించి చెప్పడమే కాదు జరగబోయే విషయాల గురించి వ్యంగ్యంగా ప్రస్తావిస్తాడు. సాధ్యంకాని విషయాలను తన బొమ్మలద్వారా, ఆలోచనల ద్వారా సుసాధ్యం చేస్తాడు. దాని కోసం సమాజాన్ని, ప్రజల ఆలోచనల్ని నిరంతరం అధ్యయనం చేస్తూ ఉంటారు. సమాజాభివృద్ధికి తోడ్పడే విధంగానే వారి ఆలోచనలు, అభిప్రాయాలు మలచుకుంటూ ఉంటాయి.

రాజకీయ నాయకులకు సుతిమెత్తని పంచ్‌లతో'బొప్పి' కట్టించడం కార్టూనిస్టులకు అలవాటైనదే. దానిని స్వీకరించే నాయకులు కూడా ఉన్నారు. అలా స్వీకరించే వారిలో హాయిగా నవ్వుకునే వారే ఎక్కువ. వారు తమ పొరపాటు నిర్ణయాలు, తాము అనుసరించే ప్రజావ్యతిరేక విధానాల గురించి ఆలోచించి కొన్ని ప్రజానుకూల నిర్ణయాలు, పనులు చేయడానికి పూనుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. హరి ఈ కోవకే చెందిన వారుగా ఉన్నారు. సంస్కరణలు, డబ్ల్యూటిఓ, దోపిడి, నీటిఎద్దడి, యుద్ధం, మొదలైన సమస్యలపై హరి పదునైన కార్టూన్స్ వేశారు. వీటిలో క్యాప్షన్‌లెస్ కార్టూన్లు చాలా బాగున్నాయి. విషయపరంగా చాలా కార్టూన్స్ బాగున్నా కొన్ని కార్టూన్స్ చప్పగా వున్నాయి. కొన్ని కార్టూన్స్ చూడగానే నవ్వొచ్చే విధంగా వున్నాయి. కార్టూనిస్ట్ ఎల్లవేళలా ప్రజాపక్షంగా వుండాలి. వామపక్ష భావాలున్న కుటుంబం నుంచి వచ్చిన హరి సహజంగానే ప్రజా సమస్యలపై ఘాటుగానే స్పందించారు. ఈ కార్టూన్లు పుస్తకంలో అన్నీ ఇటీవల దశాబ్దపు రాజకీయం, సాంస్కృతిక వాతావరణం పై వేసినవే. నిరంతర పార్టీ ఫిరాయింపు మేస్త్రీలపై, ఎలక్ట్రానిక్ మీడియా సాంస్కృతిక బ్రెయిన్ డ్రెయిన్‌జీపై వేసిన కార్టూన్‌లు. చూసి నవ్వుకోవటమే కాదు, ఆలోచిస్తారు కూడా. సామాజిక అవగాహనతో వేసే కార్టూన్ నిర్వహించే కర్తవ్యాన్ని "హరి కార్టూన్‌లు" చక్కగా నిర్వహించాయి.

- జె. వి

హరి కార్టూన్లు
వెల: రూ.50/-
పేజీలు: 100
ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో, అనన్య సాహితీ ప్రచురణలు, 6-36 క్రిష్ణ రాయపురం, పెందుర్తి, విశాఖలలో లభించును

సరిస్కా ప్యాలెస్

రాజస్థాన్ ముఖద్వారం అల్వార్

దేశరాజధాని ఢిల్లీకి తూర్పు దిక్కున 170కి.మీ.ల దూరంలో ఉన్న అల్వార్ ఒక ముఖ్య పర్యాటక ప్రాంతం. ఎడారి ఇసుక అందాలు అల్వార్ వాకిలి. దీనికి దాపునే ఉన్న అరావళ్లీ గ్రామం ఎడారి ఇసుకల తాకిడినుంచి రక్షణగా నిలిచి ఉంటుంది.

శంకర్

రాజస్థాన్‌కు ముఖద్వారం అల్వార్. ఈ అల్వార్‌లోకి ప్రయాణమవ్వడమంటే చరిత్రపుటల్లోకి, చారిత్రక కాలాల్లోకి వెళ్ళడంలాంటిది. రాజస్థాన్ లోని పురాతన నగరాల్లో ఇది ఒకటి. ఈ నగరం పురాణసాహిత్యం లోనూ, చరిత్ర ప్రస్థావనల్లోనూ స్థానం పొందిన నగరం. ఒకనాటి మత్స్యదేశంలో భాగం అయిన నగరమని చెపుతారు. మహాభారత నాయకులైన పాండవులు తమ అరణ్యవాసంలో చివరి సంవత్సరం తలదాచుకున్న విరాట మహారాజు కొలువైన విరాటనగరం దీనికి 60కి.మీ.ల దూరంలో ఉంది. మౌర్యసామ్రాజ్యం, మొఘలుల ప్రాభల్యం, బ్రిటిష్ పరిపాలకుల ఏలుబడి ఇలా అన్ని చారిత్రక ఘట్టాలలోనూ ఈ నగరం ఉంది.

ఈ రోజున అల్వార్ నగరం పెరుగుతున్న పరిశ్రమలతో, ఢిల్లీ మహానగర ఉపగ్రహనగరాల్లో ఒక నగరంగా ఎదుగుతోంది. సుందరమైన అడవులు, మెట్టప్రాంతాలతో అలరారు తోంది. ఇక్కడి చెట్టుచేమలు సంవత్సరం లో ఎక్కువకాలం ఎండి వోడువారి నట్లుంటూ వర్షాలు కురిసీకురియంగానే ఆకుపచ్చని వస్త్రాలు తొడుక్కున్నాయా అన్నట్లు పచ్చబారి పోతాయి. పచ్చదనంతో పర్యాటకుల మనసు దోచుకుంటాయి. ఇక్కడి హరితసౌందర్యం పర్యాటకుల కెమేరాలకు క్లిక్ క్లిక్ సంగీతాలను నేర్పుతాయి. అంతటి ఫొటోజెనిక్ సీనరీలు కోకొల్లలుగా ఉంటాయి. అనేక పక్షి జాతులకూ, జంతుజాలాలకు సురక్షితమైన గూడులా ఒదిగివుండే ఈ అల్వార్ నగరదాపులు టూరిస్ట్‌లకు కనువిందు చేస్తాయనడంలో సందేహం లేదు.


సిటీ ప్యాలెస్

అల్వార్ నుంచి సిలిసెరా, సరిస్కాల మీదుగా బైరత్‌నగర్ యాత్ర ఒక టూరిస్ట్ ప్యాకేజీగా ఉంది. అందమైన వన్యప్రాణి ప్రాంతం, పవిత్రమైన పురాతన దేవాలయాలు గల ప్రాంతం, మధ్య యుగాలనాటి చారిత్రక కోటలున్న ప్రాంతంగా అల్వార్ ప్రసిద్ధి.

బాలా ఖిలా: ఒకనాటి బాబర్ చక్రవర్తి విడిది చేసిన కోటగా ప్రసిద్ధి చెందిన కోట ఇది. అల్వార్ పట్టణానికి 300 మీటర్ల లోతట్టు ప్రాంతాన ఉన్న ప్రాంతం చూడచక్కని ప్రాంతం. ప్రస్తుతం ఇందులో అనేక ప్రభుత్వ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. ఈ సిటీ ప్యాలెస్‌లో లభించిన అనేక పురాతన చారిత్రక మాన్యుమెంట్‌లు, లేఖాప్రతులు, పెయింటింగ్‌లు, బంగారు, వెండి, దంతం తదితర తయారీ అభరణాలనేకం మ్యూజియంలో భద్రపరిచారు.

సతి ఆచారాన్ని పాటించిన మూసీ మహారాణీ స్మృత్యర్థం నిర్మించిన "ఛత్రి", వినయ్ విలాస్ ప్యాలెస్, కంపెనీ గార్డెన్స్, విజయ్ మందిర్ ప్యాలెస్, మోతీ డోంగ్రీ తదితర ప్రాంతాలు తప్పనిసరిగా చూడదగ్గ ప్రాంతాలు.

సిలిసెరా: జైపూర్‌కి 13కి.మీ. దూరంలో మంచి పిక్నిక్ స్పాట్‌గా ఈ సిలిసెరా ప్రసిద్ధికెక్కిన ప్రాంతం. వేసవి విడిది ప్రాంతంగా ఇక్కడ నిర్మితమైన అందమైన కోట అనేక గ్రీటింగ్ కార్డులపై అలరించింది. ప్రశాంతమైన హాలిడే పిక్నిక్‌స్పాట్‌కు సరైన ప్రాంతం ఇది.

సరిస్కా: అల్వార్‌కి 42కి.మీ.ల దూరంలో వన్యప్రాణి సంరక్షణా క్షేత్రమైన



సరిస్కా ఉంది. అపురూపమైన పక్షి జాతులను, పులులు, సింహాలు లాంటి క్రూరజంతువుల నుండి సాధారణ జంతువుల వరకూ అన్ని రకాల జంతుజాతులతో కూడిన అటవీ ప్రాంతం ఇది. ఈ అటవీప్రాంతం జులై నెల నుంచి మార్చినెల వరకూ చూడడానికి అనువైన సమయం. ఒకనాటి సరిస్కా ప్యాలెస్ ఈరోజున ఒక మంచి హోటల్‌గా రూపాంతరం చెందింది. ఈ అల్వార్‌కి ముంబయి, జోథ్‌పూర్, జైపూర్, ఢిల్లీల నుంచి విమాన, రైలు, రోడ్డు మార్గాలున్నాయి. ప్రపంచ, దేశీయ టూరిజం శాఖలు ఏర్పాటు చేసిన ప్రయాణసౌకర్యాలు కూడా ఉన్నాయి. ❖

చరిత్రలో" ఇంకిపోయిన పునాదులను పట్టుకొని వేలాడటం కాదు. ఆధునిక కవితా ప్రక్రియలో వస్తున్న నూతన ధోరణులనూ ఔపోసన పట్టి, ప్రజల చెంతకు చేరే కవిత్వాన్ని లిఖించడమే శ్రేయస్కరమని విశ్వసించే రచయిత్రి చిల్లర భవానీదేవి.

'నానీ'ల తొలి కవయిత్రి

చలపాక ప్రకాష్

అందుకే నిన్నటి కథ, కవిత్వాన్ని రాయడమే కాదు. నేటి ఆధునిక కవితా ప్రక్రియలోని ఒక ప్రత్యేక శాఖగా విస్తరిస్తోన్న 'నానీ'ల తొలి కవయిత్రిగా ఆమె ప్రత్యేక గుర్తింపును పొందగలిగారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో క్షణం తీరికలేని ఉన్నత ఉద్యోగం నిర్వహిస్తూనే, మిగిలిన ఖాళీ సమయాన్ని సాహిత్య సేవకు వినియోగించటం ఆమె ఉన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం.

1954 అక్టోబర్ 5న గుంటూరు జిల్లా బాపట్ల పట్టణంలో భవానీదేవి జన్మించారు. ప్రాథమిక విద్యను బాపట్లలోను, ఉన్నత విద్యను గుంటూరు జిల్లాలోను అభ్యసించారు. బాల్యంలోనే తన తండ్రిగారి గ్రంథాలయంలో ఉన్న అనేక సాహిత్య గ్రంథాలు చదివారు. అవి సాహిత్యంపై అభినివేశాన్ని కలిగించాయి. ఆమె ఇంటికి ప్రముఖ సాహితీవేత్తలైన పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి, డా॥ ఊటుకూరు లక్ష్మీకాంతం, తదితరులు వచ్చేవారు. వారి సాహిత్య చర్చలు భవానీదేవిలో సాహిత్యాభిమానాన్ని మరింత పెంచి బలంగా నాటుకుపోయేలా చేశాయి. పాఠశాల స్థాయిలో తెలుగు ఉపాధ్యాయులు అన్నపూర్ణ, వెలగపూడి వైదేహి గార్ల విశిష్ట వాక్పటిమతోను, కళాశాలలో డా॥కె.వి.ఎస్. ఆచార్య గారి విలక్షణమైన అధ్యాపకంతో ఈమె ప్రభావితం అయ్యారు.

1973వ సంవత్సరంలో బరంపురం వికాసం సంస్థ వారు నిర్వహించిన కథల పోటీలో భవానిదేవి రాసిన తొలికథకు ప్రథమ బహుమతి వచ్చింది. ఆ కథ స్వాతి మాస పత్రికలో ప్రచురితం కావటం సాహిత్య రంగంలో రచయిత్రిగా పునాది ఏర్పడింది. అదే సంవత్సరంలో ఆంధ్రజ్యోతి వారపత్రికలలో కట్నంపై రాసిన 'నవ్వు' అనే తొలి కవిత ప్రచురిత మయ్యింది. అది ఆమెకు మరింత ప్రోత్సాహం లభించినట్లై నిరంతరంగా తన రచనా వ్యాసంగాన్ని కొనసాగడానికి ప్రేరణగా నిలిచాయి. అదే ప్రేరణతో ఇప్పటి వరకు వందకుపైగా కథలు, రెండువందలకు పైగా కవితలు, పలు సాంఘిక చారిత్రాత్మక నాటికలు, వ్యాసాలు రచించి పాఠకుల మనస్సులలో ప్రత్యేక స్థానాన్ని పొందారు.

ఆచార్య ఎన్. గోపి సృష్టించిన, పూర్తిగా దేశీయ ప్రక్రియ అయిన 'నానీ'ల కవిత్వ పద్ధతి అనుసరించారు. నానీలు రాసిన తొలి కవయిత్రిగా, భవానిదేవి తన పేరును తెలుగు సాహిత్య చరిత్రలో లిఖించుకోగలిగారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎ (హిందీ), ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎ.(తెలుగు) అభ్యసించిన భవానీదేవి, "స్వాతంత్ర్యానంతర హిందీ, తెలుగు కవితా తులనాత్మక పరిశీలన" అనే అంశంపై ఉస్మానియా యూనివర్శిటీ నుంచి పి.హెచ్.డి. డాక్టరేట్‌ని పొందారు. వీరు చేసిన సాహిత్యసేవకు గుర్తింపుగా శ్రీశ్రీ స్మారక అవార్డు, రంజని కుందుర్తి అవార్డు, 'రంజని' వారి బుచ్చిబాబు స్మారక అవార్డు, నాళం కృష్ణరాయస్మారక ధర్మనిధి పురస్కారం, వంశీ బర్కిలి అవార్డును, వివిధ సాహిత్య సాంస్కృతిక సంస్థలు నిర్వహించిన రాష్ట్రస్థాయి కథలు, కవితలు, వ్యాసాల పోటీలలో అనేక బహుమతులు సాధించారు. 2001,2005 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉగాది వేడుకల సందర్భంగా 'విశిష్ట కవి' పురస్కారం ఆనాటి, ఈనాటి ముఖ్యమంత్రుల చేతుల మీదుగ అందుకున్నారు. ఆలిండియా రేడియో వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో పాల్గొని మళయాళం నుంచి చేసిన అనువాద కవిత్వాన్ని విన్పించి పలువురి మన్ననలు పొందారు. 1998 లో అబ్బూరి రుక్మిణమ్మ స్మారక ఉత్తమ రచయిత్రి అవార్డునూ స్వీకరించారు.

"నాలోని నాదాలు" "గవేషణ" "శబ్దస్పర్శ" వచన కావ్యాలనూ "అంతరంగ చిత్రాలు" కథా సంపుటిని 'త్యాగయోగము' అనువాదం, 'వర్ణనిశి' కవితా సంపుటి, 'భవానీ నానీలు' సంపుటాలను ప్రచురించారు. వీటిలో 'శబ్దస్పర్శ' సంపుటికి ఉమ్మిడిశెట్టి సాహితీ అవార్డు లభించటం విశేషం.

1978లో ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్‌లో ఉద్యోగినిగా 1981-82లో బాపట్లలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేసి, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు భవానీ దేవి.

సచివాలయం సారస్వత వేదిక 'చేతన'కు అధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ సచివాలయం ఉమెన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా, ఆరాధన, సంస్థకు ఉపాధ్యక్షులుగా, 'యువభారతి'కి సంయుక్త కార్యదర్శిగా, యువ కళావాహిని'కి కార్యదర్శిగా ఇంకా ఎన్నో సామాజిక, సాహిత్య సాంస్కృతిక సంఘాలలో పలు పదవులు నిర్వహిస్తూ తన సేవలను అందిస్తున్నారు. ఒకనాటి 'వనిత' పత్రికకు 20 సంవత్సరాలు కరెస్పాండెంట్‌గా వ్యవహరించి ఎన్నో మహిళా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కారానికి తగినంత కృషి చేశారు.

భవానిదేవిగారికి సామాజిక సమస్యల తోపాటు ఆధ్యాత్మిక సాహిత్యం రాయటంలోనూ అనుభవం సంపాదించారు. ఈమె రాసిన అనేక భక్తిగీతాలు ఆడియో క్యాసెట్లు గా వెలువడ్డాయి. ఈవిధంగా న్యాయశాస్త్ర పట్టభద్రులైన భవానిదేవి వర్తమాన సమాజంలోని అసమానతల పట్ల, అమానుషాలపట్ల తన అసంతృప్తిని రచనల ద్వారా వ్యక్తం చేస్తూ సమాజాన్ని జాగృత పరిచే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా స్త్రీ సమస్యలపట్ల అనేక రచనలు చేస్తున్నారు. రచయిత్రిగా ఉద్యోగినిగా ద్విముఖ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ❖



9-4-05 ఉగాది సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కవిసత్కారాన్ని అందుకుంటున్న డా॥ భవానీదేవి

చేనూ - చెరువు

నన్ను నీవు పలకరించే వేళ
నా చుట్టూ తిరుగాడే నీ పాదాలకు
పచ్చిక తివాచీ పరిచా
నా తల నిమురుతూ
నన్ను ఆప్యాయంగా తట్టితేనే
ఇల్లంతా ధాన్యపు గింజల ముగ్గులు వేసా
నీ ఇంట లేగదూడకు
లేతగరికనై కడుపునింపా
నీ పాడి ఆవుపాలై నీ గుక్క తడిపా
వానొచ్చిముంచినా వరదొచ్చి కుళ్ళినా
గుప్పెడు చల్లితే నీ గరిసె నింపా

నా గొంతు ఎండినా
నా గుండె బీటలు వారినా
రాల్చిన నాల్గు చినుకులకే రాగాలు మీటా
రాజనాలు రాల్చా
నీ కడుపునింపే
నా కడుపు తవ్వి
రొయ్యల చెరువును చేశావు
చేనుపోయె చెరువూవచ్చె
చెరువూపోయె అరువూమిగిలె
బ్యాంకోడి డప్పు ఢాం ఢాం...
పరువంతా గుప్పు గుప్పు టాం టాం...

- కోడూరు శివనాగేశ్వరరావు

ధ్వంసం లక్ష్యం కారాదు!

హత్యానేరాల ఎఫయ్యార్ పత్రాల్లోని పాత్ర
అకస్మాత్తుగా, అనుకోనిరీతిలో, అందరి సమక్షంలో
గుర్తు తెలియని కొందరిచేతుల్లో హతంకావటం
తన అకృత్యాల వల్ల తనకు ప్రాణభయమున్నదని
తానే తెలుసుకున్న వ్యక్తి
ప్రత్యర్థుల ఆకస్మిక దాడిలో హాహాకారాలు చేస్తూ చనిపోవటం
గగ్గోలుపెట్టి ప్రతిపక్షం
తామూ బాధ్యతాయుతమైన పదవుల్ని
నిర్వహించామన్న సంగతి మరచి
అడుగడుగునా ఆర్టీసీ బస్సుల్ని ఆపి అద్దాలు పగులుగొట్టి
ప్రయాణీకుల్ని దించేసి ఆ బస్సుల్ని
అగ్నికి ఆహుతి చేయటం
ప్రత్యర్థి ఫ్యాక్టరీలపైన, షాపులపైన, ఇండ్లపైనా,
ప్రభుత్వ ఆఫీసులపైనా, సంస్థలపైనా, అమాయక ప్రజలపైన
దాడులు చేయటం వాటి – వారి ఆస్తుల్ని తగులబెట్టడం!
అందినవాళ్లని చితకబాదటం! వీలుంటే చంపటం
పోలీసుల్ని ఎదిరించటం! వారినీ చితకబాదటం!
ప్రజల ఆస్తుల్ని నిరసనల పేరిట నాశనం చేయటం?
ఇది ఏ నీతని?
తాము అధికారంలోవున్నపుడు –
ఇటువంటి వాటిని ఖండించిన వాళ్లు
తిరిగితామే ఈ దుశ్చర్యలకు పాల్పడటం ద్వందనీతి కాదా?
దరిద్రపు చేష్ట కాదా? దగుల్బాజీ తత్త్వం కాదా?
చిరుకాలపు రాజకీయ నిరుద్యోగం
చిరకాలమవుతుందన్న భయంతో
చేస్తున్న ముదనష్టపు శవరాజకీయం
పాతబడిపోయిందని తెలియదా?
పదవీ దాహంతో పెదవి విప్పి గాడితప్పిన మాటల్ని



మాట్లాడుతూ మతిభ్రమణ చెందటం
పేదప్రజల్ని మరింత పేదరికంలోకి నెట్టేట్లు
ప్రభుత్వ ఆస్తుల్ని నాశనం చేయటం,
కానేకాదు ఇది సరికాదు
ముఠా హత్యలకు, రాజకీయ హత్యలకు,
ఉగ్రవాద హత్యలకు, తీవ్రవాద హత్యలకు
తలపడాల్సింది –
ప్రజల, ప్రభుత్వ ఆస్తులతో కాదు.
అర్థాంతరంగా బస్సుల్ని, రైళ్ళను ఆపుచేసి
వాటిని తగులబెట్టి ప్రయాణీకులకు
అసౌకర్యం కల్గించటం
మధ్యలో చిక్కుకున్న ఉద్యోగులు, పిల్లలు,
గర్భిణీస్త్రీలు, వృద్ధులు–
వారి బాధ వర్ణనాతీతం!
ఇంటి నుండి బయటకు
ఉద్యోగాలకొచ్చినోళ్ళు దార్లో చిక్కుకుపోయి
బిక్కుబిక్కుమనే క్షణాలు భయం తీక్షణాలు
నేరమయ జీవితంలోని వారు చంపబడితే
దానికి రాజకీయ రంగుపులిమి,
ప్రతిపక్షపు తొడుగువేసి ప్రజాజీవనాన్ని
భీభత్సంచేసే 'మనస్తత్వాన్ని'
ఆఫీసులు, ప్రత్యర్థి ఆస్తులు, పంట పొలాలు, గడ్డివాములు ప్రశ్నిస్తున్నాయి.
బస్సులూ, రైళ్ళు తమని పసిపాపల్లా చూడమని కోరుతున్నాయి.
నిరసనలూ, ఖండనలూ, సానుభూతిపరుల ఆక్రోశాలు – హద్దుల్లో వుండాలి.
అహింసా పద్ధతుల్లోనే వుండాలి.
అజ్ఞానం నుండి జ్ఞానంలోకి రావాలన్న పెద్ద మనుషులు ముందుగా
తామే జ్ఞానం వెలుగులోకి రావాలి.
'బంద్‌లు', సత్యాగ్రహాలు, ధర్నాలు దర్జాగా చేయాలి కాని...
ధ్వంసం లక్ష్యం కారాదు.

- డా॥ నాగినేని భాస్కరరావు

ADVOCATE

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

నాన్న ఆస్తిలో వాటా అడగొచ్చు

మాది ప్రేమ వివాహం. 1987వ సంవత్సరంలో వివాహం అయ్యింది. ఒక సంవత్సరం తర్వాత మా ఇంటికి పొయ్యాము. మా నాన్నగారి ఆస్తి మరియు మా అన్నయ్య నేను సంపాదించిన ఆస్తి అడిగినాము. మా అన్నయ్య ఆస్తి ఇస్తాను అని చెప్పి సంతకాలు పెట్టించుకున్నాడు. తర్వాత నన్ను నా భార్యను బాగాకొట్టి వెళ్ళకొట్టినాడు. మా అన్నయ్య మా ఏరియాలో పలుకుబడి గల వ్యక్తి. మేము భయపడి మా అత్తగారి ఇంటికి వెళ్లిపోయాము. మా అన్నయ్య చనిపోయి 4 సంవత్సరాలు అవుచున్నది. మా వదినను అడిగినా ఆమె కూడా మమ్మల్ని బెదిరించుచున్నది. మా అమ్మ గార్కి మా నాన్నగారి పెన్షన్ డబ్బులు 1500 రూ. వస్తాయి. అవి వదినకు ఇచ్చి అక్కడే వుంటున్నది. మా అమ్మ నన్ను నా భార్య పిల్లల్ని పట్టించుకోవడం లేదు. తగిన సలహా ఇవ్వగలరు.

వి. రాజేందర్, వరంగల్.

మీ నాన్నగారి ఆస్తిలో మీకు వాటా అడిగే హక్కు ఉంది. మీరు మీ అన్నగారు కలిసి సంపాదించినది ఏదైనా ఉంటే ఋజువు చేయగలిగితే దాంట్లో కూడా వాటా ఉంటుంది. మీ అన్నగారు లేనందున మీ అమ్మగారిని ఒప్పించి మీరు తీసుకొచ్చుకొని చూడాల్సిందిపోయి, ఆమెకు వచ్చే రూ.1500/- కూడా మీకు రావడంలేదని బాధపడుతున్నారు. అది చాలా తప్పు. దాంట్లో మీకెలాంటి హక్కులేదు.

పిత్రార్జితమా? స్వార్జితమా?

నా వయస్సు 45 సంవత్సరాలు. నాకు భర్త ఇద్దరు ఆడపిల్లలు, ఒకమగపిల్లవాడు ఉన్నారు. మా కుటుంబంలో నేను నాతమ్ముడు మిగిలాము. మా నాన్న ఉద్యోగం చేసి రిటైర్ అయ్యి చనిపోయాడు. మా అమ్మ అంతకుముందు చనిపోయింది. మా నాన్నను వృద్ధాప్యంలో మా తమ్ముడు అనగా కొడుకు, కోడలు చూడలేదు. మొత్తంసేవ అంతా నేనే చేశాను. అందుకుగాను మా నాన్న ఆస్తి 100గజాల ఇల్లు, 100గజాల ఖాళీస్థలము మొత్తం 200 గజాలు నాపేరు మీద రిజిస్ట్రేషన్ ఇద్దరు సాక్షులతో 1992లో చేశాడు. మానాన్న 1999లో చనిపోయాడు. అయినప్పటికి మానవతా దృక్పథంతో ఖాళీ స్థలంలో కొంత మా తమ్ముడు పేర వ్రాద్దామనుకున్నాను. కాని నన్ను ప్రతీరోజు హింసించడముతో నేను ఏమి ఇవ్వరాదని నిర్ణయించుకున్నాను. అతడు నా ఇంటిలో ఒక గదిలో వుంటున్నాడు. ప్రస్తుతం ఎందురుతిరిగాడు. దౌర్జన్యము చేస్తున్నాడు. నేను కోర్టుద్వారా నా ఇంటినుండి లేపించగలనా? నాకు ఆ ఆస్తి చెందుతుందా? తెలుపగలరు.

ఒక అపరిచిత వ్యక్తి (స్త్రీ)

మీ నాన్నగారు మీ పేరిట రిజిస్ట్రేషన్ చేసిన సదరు ఆస్తి మీ నాన్నగారి స్వార్జితమా లేక పిత్రార్జితమా? స్వార్జితమైతే అతను మీకు రిజిస్ట్రేషన్ చేశాడు కాబట్టి సర్వహక్కులు మీకే ఉంటాయి. మీ తమ్ముడుని కోర్టుద్వారా ఖాళీ చేయించవచ్చును. పిత్రార్జితమైతే మాత్రం మీ తమ్ముడికి కూడా దాంట్లో తన వాటా అడిగే హక్కు ఉంటుంది.

లీగల్‌గా తప్ప ఏ ఒత్తిడీ చేయలేదని రుజువు చేసుకోండి

మా మండలంలో (చిట్యాల) ప్రభుత్వ ఉద్యోగం చేయుచున్న ఒక వ్యక్తి 5 లక్షల రూపాయల వరకు ఒకరికి తెలియకుండా మరొకరి దగ్గర అప్పులు చేసి దుర్వ్యసనాలకు తగలేసాడు. అప్పులిచ్చిన ప్రతివారికి ప్రామిసరీ నోట్లు, పోస్ట్‌డేటెడ్ బ్యాంక్ చెక్‌లు, సంతకం చేసిన ఖాళీ చెక్‌లు ఇచ్చినాడు. అప్పులిచ్చిన వారు తమ డబ్బులు చెల్లించమని ఎన్నిసార్లు కోరిన అతను ఇవ్వనందున కోర్టులో తమకున్న ఆధారాలతో చెక్ బౌన్స్ కేసులు వేశారు. వాటిలో 4 కేసులు జడ్జిమెంట్ స్థాయిలో ఉన్నాయి. అప్పుల వాళ్ళ రుణం తీర్చేందుకు బ్యాంక్‌లో వ్యక్తిగత లోన్‌కు దరఖాస్తు చేశాడు. వారు రుణం మంజూరు చేశారు. అప్పులవారు బ్యాంక్ మేనేజర్ దగ్గరికి ఆ డబ్బు తమకే ఇవ్వాలని బ్యాంక్ మేనేజర్‌కి నోటీసు ఇచ్చి, ఒత్తిడి చేయగా, బ్యాంక్ మేనేజరు మంజూరు చేసిన లోన్‌కి రద్దుచేశాడు. బ్యాంక్ మేనేజర్ లోన్ రద్దు చేయగానే ప్రభుత్వ ఉద్యోగి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొని, మరణ వాంగ్మూలంలో తన చావుకు బ్యాంక్ మేనేజర్, అప్పులిచ్చిన వారి వేధింపులే కారణమని పేర్కొన్నాడు. ప్రామిసరీ నోట్లలో తీసుకున్న డబ్బుకంటె రెట్టింపు వ్రాయించుకొని కేసులువేసి వేధించారని పేర్కొన్నాడు. మేము మాకున్న ఆధారాలతో కేసువేసి లీగల్‌గా ప్రొసీడ్ అయ్యాము. అతడు మరణ వాగ్మూలంలో పేర్కొన్నంత మాత్రాన డాక్యుమెంట్లు నిజాలు కాకుండా పోతాయా? దీనితో వచ్చే సమస్యలను ఎలా ఎదుర్కొవాలో తెలుపగలరు.

కె. యాదగిరి, చిట్యాల.

మీరు అతడిమీద వేసినవి చెక్‌బోన్స్ కేసులే (క్రిమినల్ చర్య) అయితే అతడు చనిపోయినందున ఆ కేసులు కూడా చెల్లవు. మరణ వాంగ్మూలంలో మీ పేర్లున్నందున పోలీసు వారికి వివరంగా తెలియచేయండి. అయినా మీ పేర్లు ఎఫ్.ఐ.ఆర్‌లో నమోదయితే లాయర్లు మీ తరుపున పెట్టుకుని లీగల్‌గా తప్పితే పర్సనల్‌గా ఎటువంటి వత్తిడి చేయలేదని నిరూపించుకోవాల్సి ఉంటుంది.

బ్రెడ్ స్లైసెస్ ఐస్‌క్రీమ్

కావలసిన వస్తువులు:

చిక్కని పాలు	:	అర లీటర్
బ్రెడ్ ముక్కలు	:	ఆరు
పంచదార	:	ఒక కప్పు
మీగడ	:	నాలుగు టీ స్పూన్లు
వెనిలా ఎసెన్స్	:	నాలుగు చుక్కలు

తయారుచేసే విధానం: బ్రెడ్ ముక్కల కొనలను తీసివేయాలి. పాలు బాగా మరిగించి అందులో బ్రెడ్ ముక్కలు వేయాలి. అందులో పంచదార, మీగడ, ఎసెన్స్ వేసి కలిపి దించాలి. చల్లారిన తరువాత రెండు నిముషాలు మిక్సీలో వేసి తిప్పి బాగా నురగ వచ్చిన తరువాత తీసి బాక్స్‌లో పెట్టి డీప్ ఫ్రీజ్‌లో పెట్టి నాలుగు గంటల తరువాత తీయాలి.

ఎండు ఖర్జూర హల్వా

కావలసిన వస్తువులు:

ఎండు ఖర్జూరాలు	:	ఒక కప్పు
పంచదార	:	ఒక కప్పు
నెయ్యి	:	అర కప్పు
పాలు	:	అర కప్పు
బాదం	:	పది
జీడిపప్పు	:	పది
ఏలకుల పొడి	:	టీ స్పూన్

తయారుచేసే విధానం: ఎండు ఖర్జూరాలను నీళ్ళలో రాత్రంతా నానబెట్టి, గింజలను తీసి వేసి మిక్సీలో వేసి పేస్టులా తయారు చేయాలి. బాండీలో నెయ్యి వేడిచేసి ఖర్జూర పేస్టును వేసి బ్రౌన్ కలర్ వచ్చేంత వరకూ వేయించాలి. తరువాత పాలు పోసి ఉడికించాలి. పంచదార వేసి ఉడికించి నెయ్యి పైకి తేలిన తరువాత ఒక గిన్నెలోకి మార్చాలి. ఇప్పుడు దానిని సమంగా పరిచి ఏలకుల పొడి, బాదం, జీడిపప్పులతో అలంకరించాలి.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్
- కొత్త కోర్సుల వివరాలు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి.న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'మాథ్స్ స్కిల్స్'
- పోటీ పరీక్షల మెటీరియల్, మోడల్ పేపర్స్
- కెరీర్ గైడెన్స్
- ప్రతివారం ఓ ప్రత్యేక సమాచారం
- 'వ్యక్తిత్వవికాసం'

దీపిక

చందాదారులుగా చేరండి

సమాచారం

మీ ముంగిట నిలుస్తుంది

ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే

ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

అమూల్యమైన సమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ.150లు, పోస్టు ద్వారా రూ.160లు

అర్ధసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రు.80లు, పోస్టుద్వారా రూ.85లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ./డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్. ఫోన్: 276645420, 27663761

మేనేజర్: 27673787, ఫ్యాక్స్: 2763921.

Website: www.prajasakti.com, e-mail: prajasakti@hotmail.com